ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

5

శనివారం 19 జూలై 2025





వినూత్న ఆలోచనలతో రండి

- పరిశోధనలు, పరిశ్రమలకు ఏపీలో విస్తృత అవకాశాలు
- భవిష్యత్తు అంతా గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులదే
- జీరో కాలుష్యమే ప్రభుత్వ ధ్యేయం
- పారిశ్రామిక వేత్తలు, కంపెనీల సీఈవో, ఎండీలతో సీఎం చంద్రబాబు ముఖాముఖి


ప్రాజెక్టులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తదితరులు

ప్రోత్సాహకాలు అందిస్తాం

గుంటూరు(విద్య), జూలై 18(ఆంధ్రజ్యోతి): నీరు కొండలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శుక్రవారం గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్-2025 సదస్సు జరిగింది. ఈ సదస్సుకు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పారిశ్రామిక వేత్తలు, పరిశోధకులు, పలు కంపెనీల సీఈవోలు, ఎండీలు హాజరయ్యారు. సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఎం చంద్రబాబు నాయుడు కంపెనీల ప్రతినిధులతో ముఖాముఖి మాట్లాడారు. ప్రస్తుతం సిమెంటు, ఉక్కు, ట్రాన్స్ పోర్టు తదితర పరిశ్రమలకు అవసరమైన విద్యుత్, ఇంధనం సరఫరాకు కాలుష్యం వెదజల్లే ఉద్గారాలను వినియోగించాల్సి వస్తోందని సీఎం అభిప్రాయపడ్డారు. దీని వల్ల కాలుష్యం పెరిగిపోయి.. పర్యావరణం కలుషితం కావడంతోపాటు అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సవాళ్లను అధిగమించేలా పరిశోధనలు చేసి పరిష్కారం అన్వేషించాలని వారికి సూచించారు.

భవిష్యత్తు అంతా గ్రీన్..

ముఖ్యంగా గ్రీన్ హైడ్రోజన్ పరిశోధనలకు, కంపెనీల ఏర్పాటుకు ఇక్కడ అనేక అవకాశాలు ఉన్నాయని సీఎం చంద్రబాబు వెల్లడించారు. జీరో కార్బన్ లక్ష్యాల సాధనకు గ్రీన్ హైడ్రోజన్ లాంటి ఇంధనమే సరైన పరిష్కారమని ఆయన (మిగతా 6వ పేజీలో)

'రానున్న రోజుల్లో గ్రీన్ హైడ్రోజన్ విస్తృతంగా వినియోగంలోకి రానుంది. ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు వినూత్న ఆలోచనలు, సాంకేతికతతో వచ్చే ఆవిష్కర్తలకు, పారిశ్రామికవేత్త లకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుంది. పరిశ్రమలకు, ప్రాజెక్టులకు అవసరమైన అన్ని రకాల ప్రోత్సాహకాలు అందిస్తాం'
- సీఎం, చంద్రబాబునాయుడు


పూర్తయిన గృహాలు

శ్రావణంలో గృహయోగం

- జిల్లాలో 6,785 ఇళ్ల ప్రారంభోత్సవాలకు సన్నాహాలు

సామూహిక గృహ ప్రవేశాలకు చర్యలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)
పేదలకు సొంతింటి ప్రవేశానికి ప్రభుత్వం ముహూర్తం నిర్ణయించింది. ఈ నెల 25 నుంచి శ్రావణమాసం. ఈ మాసంలో ఎక్కువమంది ఇళ్లలో చేరేందుకు ఆసక్తి చూపుతారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే పైకప్పు పూర్తయిన, పైకప్పు దశకు చేరిన ఇళ్లపై అధికారులు దృష్టి సారించారు. 36 లేవుట్లలో 11,241 గృహాల నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఇప్పటి వరకు 6785 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. ఈ ఇళ్లలో గృహప్రవేశాలకు సన్నాహాలు చేస్తున్నారు. మరో వెయ్యి గృహాల పనులను కూడా ఈ నెలలో పూర్తి చేయనున్నారు. ఈ లక్ష్యాలను చేరుకుని శ్రావణ మాసంలో పేదలకు స్వ గృహయోగం కల్పించడానికి గృహ నిర్మాణ సంస్థ కసరత్తు చేస్తోంది. సామూహిక గృహ ప్రవేశాలకు ఇప్పటి నుంచే అధికారులు సన్నాహాలు చేపట్టారు. గృహనిర్మాణ శాఖ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.

అదనపు సాయంతో నిర్మాణాలు..

పేదలందరికీ ఇళ్లు కట్టిస్తాం.. అంటూ గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం ముందుకు సాగలేదు. ఇళ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను కూడా దారిమళ్లించి లబ్ధిదారులకు మొండిచేయిచూపింది. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిర్మాణాలు చేపట్టి నిలిచిపోయిన ఇళ్లపై కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. అదనపు సాయం చేస్తే పలువురు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని అధికారులు తేల్చారు. ఈ క్రమంలో వివిధ దశల్లో ఉన్న ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేలు, ఎస్సీ బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు అదనపు సాయం ప్రభుత్వం అందించింది. దీంతో ఆయా వర్గాలకు చెందిన వారు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేశారు.

గాంధీ జయంతికి.. స్వచ్ఛాంధ్ర బహుమతి!

గాంధీ జయంతికి 'స్వచ్ఛాంధ్ర'ను రాష్ట్ర ప్రభుత్వం బహుమతిగా ఇవ్వనుంది. మునిసిపాలిటీల కంపోస్టు యార్డుల్లో పేరుకు పోయిన చెత్త నిల్వలను పూర్తిగా తొలగించేందుకు లక్ష్యంగా పెట్టుకుంది. వ్యర్థాల నుంచి కూడా సంపద సృష్టించేలా ప్రణాళికాబద్ధంగా ముందు కెళ్తోంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ.. రూ.30.35 కోట్ల నిధులు కేటాయించింది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొనేలా పనులు చేయిస్తోంది.

- కంపోస్టు యార్డుల్లో పేరుకుపోయిన చెత్తకు మోక్షం
- రూ.30.35 కోట్లతో చెత్త శుద్ధి పనులు
- అక్టోబరు 2వ తేదీ కల్లా తొలగింపు దిశగా చర్యలు
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి నిధులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీల కంపోస్టు యార్డుల్లో టన్నుల కొద్ది చెత్త నిల్వలు పేరుకుపోయాయి. వ్యర్థాలు కుళ్లి కంపుకొడుతున్నాయి. రోజూ సేకరించిన చెత్త అక్కడ వేసే పరిస్థితి లేదు. వైసీపీ ప్రభుత్వం హయాంలో యార్డుల్లో చెత్త తొలగింపు పనులు చేపట్టి, నిలిపివేశారు. అలాగే పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగం అయ్యాయి. చెత్త తొలగింపునకు లెక్కలు కూడా నాడు లేవు. కూటమి ప్రభుత్వం మునిసిపాలిటీల కంపోస్టు యార్డుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు చేపట్టింది. స్వచ్ఛాంధ్ర (మిగతా 6వ పేజీలో)


నరసరావుపేట కంపోస్టు యార్డులో చెత్తశుద్ధి పనులు

మున్సిపాల్టీల వారీగా పేరుకుపోయిన వ్యర్థాలు

మునిసిపాల్టీ	తొలగించనున్న వ్యర్థాలు టన్నుల్లో
చిలకలూరిపేట	1,66,278
నరసరావుపేట	30,609
మాచర్ల	30,894
పిడుగురాళ్ల	10,793
వినుకొండ	11,195
దాచేపల్లి	6,194
గురజాల	1,675
గుంటూరు	43,811
పొన్నూరు	8,376
బాపట్ల	46,264
రేపల్లె	7,203



పెట్రోల్‌కు బదులు నీళ్లు కొట్టారు

- బంకు ముందు ఆందోళన..

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

- ఈ నెల 30 తేదీ వరకు గడువు: డీఈఓ రేణుక

6

రక్తం అందిస్తేనే.. ప్రసవం



- ప్రతి ముగ్గురు గర్భిణుల్లో ఒకరికి రక్తహీనత
- పౌష్టికాహారం తీసుకోక బలహీనం

ఆనందం వెద జల్లుతున్నారు


8


వృద్ధురాలికి కరపత్రం ఇస్తున్న హోం మంత్రి వంగలపూడి అనిత, మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తదితరులు

రప్పారప్పా.. నరుకుతామంటే ఊరుకోరు

- ప్రజలను భయపెట్టేందుకు జగన్ ప్రయత్నం
- కంభంపాడులో హోంమంత్రి వంగలపూడి అనిత
- అర్హులందరికీ పథకాలన్న ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి

పెదకూరపాడు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): 'నేను వస్తానని చెపుతున్నావు.. ఏ ముఖం పెట్టుకుని వస్తావు. మంచి చేస్తానని చెప్పకుండా రప్పారప్పా నరుకుతామని చెప్పి వస్తున్నా అంటే ఎవరైనా ఊరుకుంటారా..' అని వైసీపీ అధినేత జగన్‌పై హోంమంత్రి వంగలపూడి అనిత ధ్వజమెత్తారు. పెదకూరపాడు మండలంలోని కంభంపాడులో శుక్రవారం జలాలపురం నుంచి పరస రోడ్డును ప్రారంభించి కంభంపాడు నుంచి 14వ మైలుకు వెళ్లే రోడ్డుకు మరో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌తో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో సుపరిపాలనలో - తొలి అడుగు, ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ నోటికి వచ్చినట్లు మాట్లాడుతూ ప్రజలను భయపెట్టేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారన్నారు. మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు, తల్లికి వందనం తదితర పథకాలను అమలు చేశామన్నారు. కుటుంబ సాధికార సారథులు ప్రతి ఇంటికి వెళ్లి పథకాల అమలు తీరును ప్రజలకు వివరించి, వైసీపీ నేతల దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలన్నారు. హింసను ప్రేరేపించేలా మాట్లాడడం వైసీపీ నేతలకు తగదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భాష్యం లావణ్య, వెన్నా సాంబశివారెడ్డి, పఠాన్ నూర్జహాన్, మాదినేని వెంకటసుబ్బయ్య, వేగుంట రాణి, ఏటుకూరి బ్రహ్మయ్య, మాదినేని బాలాజీ, వాసు, అర్తిమళ్ళ రమేష్, శ్రీనివాసరావు, ఏటుకూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కరుణించిన వరుణుడు

- పత్తి పంటకు జీవం పోసిన వర్షం
- వెల్దుర్తిలో అత్యధికంగా 78 మిమీ వర్షపాతం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)
వేసవిని తలపించే ఎండలతో అల్లాడించిన వాతావరణం శుక్రవారం చల్లబడింది. వరుణుడు కరుణించడంతో గురువారం రాత్రి నుంచి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీగా వర్షం కురిసింది. పత్తి పంటకు ఈ వర్షం జీవం పోసింది. వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో పదునెక్కిన పొలాల్లో సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. అత్యధికంగా వెల్దుర్తి మండలంలో 78మిమీ వర్షపాతం నమోదైంది. పెదకూరపాడు మండలంలో 69.2 మిమీ, నాదెండ్ల 60, అచ్చంపేట 55.2, బొల్లాపల్లి 54, సత్తెనపల్లి 52, నూజెండ్ల 50, నరసరావుపేట 43.5, క్రోసూరు 42.6, శావల్యాపురం 38.4, ఈపూరు 24, చిలకలూరిపేట 24.8, వినుకొండ 19, యడ్లపాడు 22.8, పిడుగురాళ్ల మండలంలో 18 మీమీ వర్షపాతం నమోదైంది.


కాల్వలపై మూతలు వేసి బడ్డీ బంకులు పెట్టిన దృశ్యం

6

పారిశుధ్య పాఠం నేర్చేదెన్నడు?

- పూడుకు పోతున్న మురుగు కాల్వలు
- ఆక్రమణల నుంచి కలగని మోక్షం

జీవోకు తూట్లు.. లక్షల్లో వసూళ్లు

నిబంధనలకు విరుద్ధంగా..

గ్రేడ్-3 ఏఎన్‌ఎంల బదిలీల్లో అక్రమాలు • వందమందికి సొంత మండలంలోనే పోస్టింగ్

గుంటూరు సిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో తాజాగా జరిగిన గ్రేడ్-3 ఏఎన్ఎం (యాక్జలరీ నర్స్ ఫర్ మిడ్ వైఫరీ)ల బదిలీల్లో భారీ అక్రమాలు జరిగాయి. వైద్య, ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఏఎన్ఎంలు కోరుకున్న చోటకు బదిలీ అయ్యేందుకు భారీగా ముట్టజెప్పినట్లు తెలుస్తుంది. అడిగినంత ఇచ్చిన వారి కోసం అధికారులు కూడా జీవో నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారు. అవినీతి వ్యవహారాలు ఆరోగ్య శాఖకు కొత్త కానప్పటికీ ఈసారి మోతదు మరీ పెరిగిపోవడంతో విషయం రచ్చకెక్కింది. జూన్ 12న విడుదలైన జీవో 5 ప్రకారం ఐదేళ్లు దాటిన వారికి కచ్చితంగా స్థానచలనం జరగాలి.. ఉద్యోగులను సొంత మండలంలో ఉంచడానికి వీలులేదు. అయితే ఈ నిబంధనను వైద్యఆరోగ్య శాఖలో పక్కన పెట్టేశారు. మొత్తం 977 మంది గ్రేడ్-3 ఏఎన్ఎంలకు కౌన్సెలింగ్ నిర్వహించగా వందమందికిపైగా సొంత మండలాల్లోనే నియమించారు. సొంత మండలం దాటితే ఇబ్బందని భావించిన ఉద్యోగులు అక్కడే ఉండేందుకు రూ.లక్షల్లో ముడుపులు ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. ఇది గుంటూరులోని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు బాగా కలిసి వచ్చింది.

అటెండర్... సూపర్‌వైజర్ హవా..

గ్రేడ్-3 ఏఎన్ఎంల బదిలీలు గుంటూరు డీఎంహెచ్ కార్యాలయంలోని ఓ అటెండర్, ఓ సూపర్‌వైజర్ కనుసన్నల్లో జరిగిందన్న ఆరోపణలున్నాయి. ఎంతోకాలంగా అక్కడ తిష్ఠ వేసిన వీరు ముఖ్య అధికారికి, ఏఎన్ఎంలకు మధ్య రాయబేరాలు నడిపినట్లు సమాచారం. సొంత మండలంలో ఉంచడానికి ఒక్కొక్కరి వద్ద రూ.లక్ష నుంచి లక్షన్నర వరకు వసూలు చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. నగదు ముట్టజెప్పిన వారికి లబ్ధి చేకూర్చేందుకు అధికారులు ఖాళీలను బ్లాక్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే బదిలీల జాబితాను పదే పదే మార్చినట్లు సమాచారం. పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగిన నియామకాలన్నీ అక్రమంగా జరిగాయని సమాచారం. ఈ అక్రమాలు వెలుగులోకి రావాలంటే విజిలెన్స్ విచారణ జరిపించాలని పలువురు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు.

- వేమూరు మండలం వరహాపురం ఏఎన్ఎంను అదే మండలంలోని బలిజేపల్లికి, కుచ్చళ్ల పాడులోని ఏఎన్ఎంను వరహాపురానికి, పెనుమర్రు ఏఎన్ఎంను జంపనికి మార్చారు.
- చుండూరు మండలం శ్రీరంగపురం నుంచి ఏఎన్ఎంను అదేమండలంలోని వేటపాలేనికి, తొట్టెంపూడి ఏఎన్ఎంను మోదుకూరుకు, అంబేద్కర్‌నగర్ ఏఎన్ఎంను పెనుగుదురుపాడుకి మార్చారు.
- భట్టిప్రోలు మండలం ఐలవరం-1, ఐలవరం-2ల్లోని ఏఎన్ఎంలను అటుఇటు మార్చారు.
- పెదనందిపాడు-1 ఏఎన్ఎంను అదే మండలంలోని వరగానికి, పెదనందిపాడు-2 ఏఎన్ఎంను పెదనందిపాడు-1కు బదిలీ చేశారు. గోగులమూడి ఏఎన్ఎంను సొంత మండలంలోనే నియమించారు.

వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం


కుర్చీ కోసం కుస్తీ



- సిమ్ము, గన్ ఇవ్వని విజయపురిసౌత్ ఎస్ఐ
- నెల రోజులుగా నూతన అధికారి ఎదురుచూపు

మాచర్ల రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విజయపురిసౌత్ ఎస్ఐ కుర్చీపై రచ్చ నెలకొంది. గతంలో ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహించిన మహ్మద్‌షఫీ కుర్చీ కోసం కుస్తీ పడుతున్నారు. బదిలీపై వచ్చిన అధికారికి సిమ్ము, గన్ ఇవ్వడంలేదనే ఆరోపణలున్నాయి. నరసరావుపేట రూరల్ నుంచి విజయపురి సౌత్ ఎస్ఐగా అశోక్‌కు ఉన్నతాధికారులు గత నెల 20న పోస్టింగ్ ఇచ్చారు. అయితే ఈ కుర్చీ కోసం షఫి గట్టిగానే పోరాడుతున్నట్లు సమాచారం. ఆ సీటు తనదేనంటూ చెప్పుకుంటున్నారని, ఈ నెల మొదటి వారంలో విజయపురిసౌత్‌కు వచ్చినా సంగతేంటి అంటూ కొందరికి ఫోన్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రపంచ పర్యాటక కేంద్రమైన విజయపురిసౌత్‌లో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా చూడడం అత్యంత ముఖ్యమని ఈ పరిస్థితుల్లో ఇక్కడ పూర్తి స్థాయి ఎస్ఐ ఎవరనేది తెలియక అటు సిబ్బంది, ఇటు ప్రజలు తలలు పట్టుకుంటున్నారు. ఏదైనా సమస్య తలెత్తితే ఎవరిని సంప్రదించాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. సిమ్ము కూడా పలుమార్లు పనిచేయడం లేదంటూ ప్రజలు చెబుతున్నారు.

కేసులో ఉన్నారు..

దీనిపై గురజాల డీఎస్పీ జగదీష్‌ను వివరణ కోరగా..షఫి ఓ కేసువిషయంలో విచారణలో ఉన్నారని, రాగానే అశోక్‌కు సిమ్ము, గన్ ఇవ్వమని చెప్తామన్నారు.

గాంధీ జయంతికి.. 'స్వచ్ఛాంధ్ర' బహుమతి!

(5వ పేజీ తరువాయి)

కార్పొరేషన్ ద్వారా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మునిసిపాలిటీల్లో చెత్త శుద్ధికి రూ.30.35 కోట్లు నిధులు విడుదల చేసింది. టెండర్ ప్రక్రియ ద్వారా మహాత్మా గాంధీ జయంతి అక్టోబరు 2వ తేదీ కల్లా వ్యర్థాలను తొలగించే దిశగా పనులు నిర్వహిస్తున్నారు.

3.63 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త శుద్ధి

పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, చిలకలూరిపేట, మాచర్ల, పిడుగురాళ్ల, వినుకొండ, దాచేపల్లి, గురజాల, గుంటూరు జిల్లాలోని గుంటూరు కార్పొరేషన్, పొన్నూరు, బాపట్ల జిల్లాలోని రేపల్లె, బాపట్ల కార్పొరేషన్ సహా మొత్తం 11 చోట్ల పనులు జరుగుతున్నాయి. 3.63 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త శుద్ధి చేయాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ లక్ష్యంగా పెట్టుకుంది. కంపోస్టు యార్డుల్లో పేరుకు పోయిన చెత్తను ఎరువుగా మర్చే ప్రక్రియ జరుగుతోంది. ఇందుకు సంబంధించి యార్డుల్లోనే యంత్రాలను ఏర్పాటు చేశారు.

వ్యర్థాల తొలగింపు ఇలా..

రెడ్‌బే టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెత్త తొలగింపు పనులను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అప్పగించింది. చెత్తలో ఉన్న ప్లాస్టిక్ కవర్లను వేరు చేసి అవసరమైన కంపెనీలకు తరలిస్తారు. వ్యర్థాల్లో వస్త్రాలు, మట్టి, రాళ్లు, ప్లాస్టిక్‌ను యంత్రాల ద్వారా వేరు చేస్తారు. ఇలా వచ్చే మట్టిని మునిసిపాల్టీల్లో లోలెవల్ ప్రాంతాలకు వినియోగించనున్నారు. మొత్తం మీద మునిసిపాలిటీల కంపోస్టు యార్డుల వద్ద రహదారులపై గుట్టలు గుట్టలుగా పేరుకుపోయిన వ్యర్థాలను పూర్తిగా శుభ్ర పరచనున్నారు. వ్యర్థాలను యార్డులకు తరలించే పరిస్థితి లేక.. రహదారుల మార్జిన్‌లలో తగలబెట్టే పరిస్థితి కూడా ఇక ఉండదు. ఇక మీదట తడి పొడి చెత్తను కచ్చితంగా వేరు చేయాలని మునిసిపాలిటీలను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆదేశించింది. ఘన వ్యర్థాలను విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌లకు తరలించాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియ పూర్తి స్థాయిలో అమలు జరిగితే పట్టణాల్లో పరిశుభ్రత నెలకొనే అవకాశం ఉంది.

మద్యం మత్తులో ట్రాన్స్‌ఫార్మర్ పట్టుకుని..

● విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

కొల్లూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకున్న యువకుడు షాక్‌కు గురై గాయపడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కొల్లూరు ఎస్‌సి కాలనీకి చెందిన గొరికపూడి కిరణ్‌కుమార్ మద్యం సేవించి.. మత్తులో మూత్ర విసర్జన చేసేందుకు ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో షాక్‌కు గురై కింద పడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు మెరుగైన చికిత్స కోసం తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తీసుకు వెళ్లాలని సూచించడంతో 108 అంబులెన్స్‌లో తరలించారు. యువకుడిని అక్కడి వైద్యులు పరిశీలించి ప్రాణాపాయం లేదని తెలిపారు.



గాయపడిన యువకుడు

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

● ఈ నెల 30 వరకు గడువు: డీఈవో రేణుక

గుంటూరు(విద్య), జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం దూర విద్య ప్రవేశాలు(ఓపెన్ స్కూల్)-2025-26 సంవత్సరానికి ప్రారంభమయ్యాయని జిల్లా విద్యాశాఖాధికారి సి.వి.రేణుక శుక్రవారం తెలిపారు. అపరాధ రుసుం లేకుండా ఈ నెల 30వ తేదీ వరకు ఆడ్మిషన్లకు పొంద వచ్చని పేర్కొన్నారు. 15 ఏళ్లు నిండిన వారికి ఇంటర్ విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత సాధించనవారికి వారికి కూడా అవకాశం ఉందన్నారు. ఇతర వివరాల కోసం అభ్యర్థులు తమ ప్రాంతంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లేదా దూరవిద్య కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

నేడు గుంటూరు నగరానికి

మంత్రి లోకేశ్

గుంటూరు(విద్య), జూలై 18 (ఆంధ్రజ్యోతి): ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) ఆధ్వర్యంలో శనివారం గుంటూ రులో జరిగే సదస్సుకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హాజరుకానున్నారు. స్థానిక అమరావతి రోడ్డులోని బండ్లమూడి గార్డెన్స్‌లో సీఏ నిపుణులతో ముఖాముఖి మాట్లాడనున్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తారు. సీఏ కోర్స్ కోర్సు పూర్తి చేయడానికి ఐసీఏఐ సహకారం గురించి వివరించనున్నట్లు ఐసీఏఐ అధ్యక్షుడు ప్రసన్నకుమార్ వెల్లడించారు.

గుండె సమస్యలకు కేఎల్‌యూ విద్యార్థిని నూతన పరిష్కారం

తాడేపల్లి (వడ్డేశ్వరం), జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల పరిశోధన విద్యార్థిని శ్రేయ కొసనం గుండె సంబంధిత సమస్యలకు మొక్కల ఆధారిత చికిత్సలకు నూతన పరిష్కారాలు కనుగొన్నట్లు వర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చక్రవర్తి శుక్రవారం తెలిపారు. డాక్టర్ రాజేశ్వరి పసుపుల మార్గదర్శకత్వంలో గుండె సంబంధిత వ్యాధులపై పరిశోధన చేసిన శ్రేయ సాంప్రదాయ మొక్కల నుంచి గుండెకు ఏర్పడే పలు రకాల సమస్యలకు ఔషధాలు తయారు చేయవచ్చనే పరిశోధనకు శ్రేయ ఫార్మసీ కళాశాల నుంచి పీహెచ్‌డీ డిగ్రీని అందుకున్నట్టు తెలిపారు. ఆమె చేసిన పరిశోధనను మెడికల్ భాషలో ఇన్వెస్టిగేషన్స్ ఆన్ మిథైల్ గ్లైకోసైడ్ అండ్ సిన్నమోయిల్ డెరివేటివ్ ఫ్రమ్ అగనోస్మ డైకొటోమా ఎగనెస్ట్ మయోకార్డియల్ ఇస్కీమియారి పెరిఫ్యూజం ఇంజరీ ఇంటిగ్రేటింగ్ కంప్యూటేషనల్ టెక్నిక్స్ విత్ సెల్‌లైన్ వ్యాలిడేషన్ యూజింగ్ హెచ్9సీ2 కార్డియో ఈ సందర్భంగా ఆమెను కేఎల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చక్రవర్తి, డాక్టర్ బుచ్చినాయుడు, ఆర్ ప్యాక్ ఛైర్మన్ డాక్టర్ నరేంద్ర అభినందించారు.



శ్రేయ కొసనం

పేద కుటుంబాలను ఆదుకోవడమే పీ4 లక్ష్యం

స్వర్ణాంధ్ర-2047 ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ వెలమాటి రామ్‌నాథ్

పెదనందిపాడు, జూలై, 18(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకోవడమే పీ4 లక్ష్యమని స్వర్ణాంధ్ర - 2047 ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ వెలమాటి రామ్‌నాథ్ పేర్కొన్నారు. స్థానిక పీఏఎస్ కళాశాలలో ఓ కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. గ్రామాల్లో పేద కుటుంబాలను గుర్తించి, వారిని ఆదుకునేందుకు ఆ గ్రామంలోనే ఆయా రంగాల్లో అభివృద్ధి చెందిన వారికి అప్పగించి, అన్ని విధాలా ఆదుకునే లక్ష్యంతో సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 15 లక్షల పేద కుటుంబాలు ఉండగా ఇప్పటికే 5 లక్షల కుటుంబాలను గుర్తించడం జరిగిందన్నారు. త్వరలో మరో పది లక్షల కుటుంబాలను గుర్తించడం జరుగుతుందని.. దీనిపై ప్రణాళికా బద్ధంగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని తెలిపారు. పథకం రూపకల్పనకు మేధావులతో చర్చించి నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ పథకాన్ని ప్రధాన మంత్రి అన్ని రాష్ట్రాల్లో ఏర్పాటు చేసేవిధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో జిల్లా, నియోజకవర్గ, మండల గ్రామ కమిటీలు కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. దీనిని ఆగష్టు 15న లాంఛనంగా ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఏఎస్పీ కాళహస్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెలమాటి రామ్నాథ్

ఒప్పంద అధ్యాపకుల రెన్యువల్‌కు ఆహ్వానం

గుంటూరు (విద్య)జూలై 18 (ఆంధ్రజ్యోతి): జోన్-3 పరిధిలోని ప్రభుత్వం డిగ్రతీ కళాశాలల్లో ఒప్పంద ప్రాతిపదికన గత సంవత్సరం పనిచేసిన అధ్యాపకుల నుంచి రెన్యూవల్ కోసం దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల విద్య సంయుక్త సంచాలకులు పి.కళావతి శుక్రవారం ప్రకటన తెలిపారు. అధ్యాపకులు 2024-25 విద్యా సంవత్సరంలో పనిచేసి 60 సంవత్సరాలలోపు వయసు ఉండాలని సూచించారు. ఈ నెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జోన్ 3 పరిధిలో ఉమ్మడి గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని ప్రభుత్వ డిగ్రీ, ఓరియంటల్ కళాశాలల్లో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 39, ఓరియంటల్ కళాశాలల్లో 10 పోస్టులు రెన్యువల్ చేస్తామని తెలిపారు. ఇతర వివరాల కోసం ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సంప్రదించాలని తెలిపారు.

జంతు శాస్త్ర అధ్యాపక పోస్టుకు..

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో(గుంటూరు) జంతు శాస్త్రం అధ్యాపక పోస్టుకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థికి 55 సంవత్సరాలోపు వయసు, జాతీయ స్థాయి అర్హత పరీక్ష పూర్తి చేసి, పీహెచ్‌డీ ఉన్నవారికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఈ నెల 22న కళాశాల జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ఎక్స్‌గ్రేషియా

గుంటూరు సిటీ, జూలై 18(ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ఎక్స్ గ్రేషియా ప్రకటిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ వీర పాండ్యన్ శుక్రవారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. 2019 ఫిబ్రవరిలో అప్పటి టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం తీసుకొచ్చిన జీఓ నంబరు 25 కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు కూడా వర్తిస్తుందని కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ జీఓ ప్రకారం ఉద్యోగులు ప్రమాదవశాత్తు మరణిస్తే.. రూ. 5 లక్షలు, సహజ మరణం పొందితే రూ. 2లక్షలు కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అంద జేస్తుంది. దీనిపై ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నిరంజన్, కార్యదర్శి సందీప్ హర్షం వ్యక్తం చేశారు.

'మందలింపు'తో..

రైలు కింద కాళ్లు పెట్టిన విద్యార్థిని

●కాళ్లు తెగిపోయి మృత్యువుతో పోరాటం

బాపట్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : రైలు కింద పెట్టిన రెండు కాళ్లు తెగిపోయి మృత్యువుతో పోరాడుతున్న విద్యార్థిని విషాద ఘటన ప్రజల్ని కలిచివేసింది. శుక్రవారం జరిగిన ఈ ఘటనపై కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. బాపట్ల పట్టణంలోని 12వ వార్డు వెంగళ విహార్‌కు చెందిన విద్యార్థిని ఓ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. రెండు రోజులు నుంచి విద్యార్థిని పాఠశాలకు వెళ్లక పోవడంతో తల్లి ప్రశ్నించింది. దీంతో పాఠశాల ప్రిన్సిపల్ మందలించారని చెప్పింది. పాఠశాలకు వచ్చి మాట్లాడతామని చెప్పి, స్కూల్‌కు వెళ్లమని బాలికకు తల్లి సూచించింది. దీంతో మనస్థాపానికి గురైన విద్యార్థిని వాష్ రూమ్‌కు వెళ్తున్నట్లు చెప్పి.. జీబీసీ రోడ్డులోని ఆర్‌వోబీ దగ్గర రైలు పట్టాలపై కాళ్లు పెట్టి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనలో బాలిక రెండుకాళ్లు తెగిపోయాయి. స్థానికులు గుర్తించి హుటాహుటీన బాలికను ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలిక ఆత్మహత్యాయత్నానికి సంబంధించి భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. స్కూల్‌కు వెళ్లడం లేదని తల్లి మందలించడం ఒక వాదన కాగా.. పాఠశాలలో ఉపాధ్యాయులు మందలించారనే మరొక వాదన వినిపిస్తోంది. పూర్తివివరాలు తెలియాల్సి ఉంది. రైల్వే పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆసుపత్రికి వెళ్లి బాలిక వివరాలు నమోదు చేసుకొన్నారు. రెండు కాళ్ళు తెగిపోయినట్లు వైద్యులు చెప్పారని ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వినూత్న ఆలోచనలతో రండి!

(5వ పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. భవిష్యత్తు అంతా గ్రీన్ హైడ్రోజన్‌దేనని, పారిశ్రామిక రంగంలో విప్లవాత్మక మార్పులకు ఇది శ్రీకారం చుట్టనుందన్నారు. సామాన్యులకు అందుబాటులో ఉండేలా దీనిని ప్రజలకు అందుబాటులోకి తేవాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి ఇప్పటికే కార్యాచరణ సిద్ధమైందని, ఇందులో పారిశ్రామిక వేత్తలు భాగస్వాముల కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి కూడా త్వరలోనే ప్రారంభం అవుతుందన్నారు. 160 మెగావాట్ల గ్రీన్ హైడ్రోజన్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని ఏపీ నిర్దేశించుకుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 3 గిగా వాట్ల సామర్థ్యంతో ఎలక్ట్రో లైజర్ల ద్వారా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయనున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే ఏపీలో సౌర, పవన, పంప్డ్ విద్యుత్ ఉత్పత్తికి అపారమైన వనరులు ఉన్నాయని, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుల ఏర్పాటుకు 1000 కిలోమీటర్ల కోస్తా తీరం, నీరు అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది నాటికి గ్రీన్ ప్రాజెక్టులు పనిచేసే స్థాయి రావాలని చంద్రబాబు అభిలాషించారు.

రూ.51 వేల కోట్ల ఒప్పందాలు

ఏపీలో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేసేందుకు రెండు సంస్థలు ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో సదస్సు వేదికగా ట్రాన్సఫర్మేటివ్ అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం, సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. యూకేకు చెందిన యమ్నా సంస్థ రూ.16 వేల కోట్ల పెట్టుబడితో నెల్లూరు జిల్లా కృష్ణపట్నం వద్ద ఏడాదికి మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు ఎంఓయూ కుదుర్చుకుంది. అలాగే కేఎస్‌ఏహెచ్ ఇన్‌ఫ్రా సంస్థ మచిలీపట్నంలో 150 కిలో టన్నుల సామర్థ్యంతో గ్రీన్ హైడ్రోజన్, 600 కిలో టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఇందుకు రూ.35 వేల కోట్లను పెట్టుబడి పెట్టనుందని ముఖాముఖి తర్వాత జరిగిన సదస్సులో సీఎం చంద్రబాబు ప్రకటించారు. ముఖాముఖి సదస్సులో నీతి అయోగ్ సభ్యులు డాక్టర్ వీకే సారస్వత్, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.జయానంద్, ఎస్‌ఆర్‌ఎం వర్సిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ పి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి నారాయణరావు, హైడ్రోజన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌కే మల్హోత్రా, నేషనల్ కెమికల్ ల్యాబ్(పూనే) డైరెక్టర్ డాక్టర్ ఆశీస్ లేలే, నెడ్ క్యాప్ రాష్ట్ర అధికారి డాక్టర్ కమలాకర్‌బాబు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయం హుండీ రాబడి రూ. 51,23,353

దుర్గి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అడిగొప్పల నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయ హుండీ ఆదాయం శుక్రవారం లెక్కించారు. రూ.51, 23,353లు సమకూరినట్లు ఈవో ఆదిశేషు నాయుడు, కోటప్పకొండ ఏసీ చంద్రశేఖర్ తెలిపారు.

తెలుగు భాషా వికాసంపై.. లఘు చలన చిత్ర పోటీలు

గుంటూరు(తూర్పు), జూలై 18: మూడో ప్రపంచ తెలుగు మహా సభలు -2026 సందర్భంగా ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో తెలుగు భాషా వికాసంపై అంతర్జాతీయ లఘు చలన చిత్ర పోటీలు నిర్వహించనున్నట్లు పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు భాష చారిత్రక వైభవం, ఆంధ్ర సారస్వత దీప్తి, తెలుగు భాషా వికాసం, తెలుగు వెలుగులు, తెలుగు భాషా రక్షణ - ప్రాచుర్యం అంశాలుగా పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఎంపికైన చిత్ర ప్రదర్శన వేడుకను గుంటూరు భారతీయ విద్యా భవన్‌లో సెప్టెంబరు 14న నిర్వహిస్తామని తెలిపారు. ఎంట్రీల నిడివి 5 నిమిషాలు మాత్రమే ఉండాలని, 4 నిమిషాలకు తక్కువగా ఉండరాదని తెలిపారు. ఆగస్టు 14 లోపు పంపాలని పేర్కొన్నారు. ఎంట్రీలు "ఏఎస్‌పీ షార్ట్ ఫిలిమ్ కాన్ టెస్ట్' ఎట్‌దిరేట్ మెయిల్‌కు పంపాలన్నారు. ఇతర వివరాలకు 91826 12419 అనే నంబరుకు సంప్రదించాలని సూచించారు.

వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్‌కు స్థల పరిశీలన

మాచర్ల రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురి సౌత్‌లో గల మేకల గొంది నుంచి జలజీవన్ మిషన్ ద్వారా రూ.1,200 కోట్లతో నియోజకవర్గంతో పాటు పల్నాడు ప్రాంతానికి తాగు నీటిని అందించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఈ నేపథ్యంలో జిల్లా అరుణ్‌బాబు శుక్రవారం మేకల గొందిలో వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేసే స్థలం సర్వే మ్యాపును పరిశీలించారు. అన్ని అనుమతులు మంజూరైతే.. వాటర్ గ్రిడ్ నిర్మాణానికి ముహూర్తం ఖరారు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, డీఎఫ్‌వో సందీప్‌కుమార్, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఇరిగేషన్ ఈఈ రమేష్ పాల్గొన్నారు.



మ్యాపులను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



ప్రారంభోత్సవంలో మంత్రి వాసంశెట్టి, ఎమ్మెల్యే పుల్లారావు, కమిషనర్ ఎం కృష్ణతేజ

చిలకలూరిపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): లింగంగుంట్ల గ్రామంలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన తాగునీటి పైప్‌లైన్ పథకాన్ని శుక్రవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఎం.కృష్ణ తేజ ప్రారంభించారు. తమ గ్రామానికి శాశ్వతంగా మంచినీటి సమస్యకు.. పరిష్కారం చూపిన ఆనందంలో గ్రామస్తులు వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కృష్ణ తేజ మాట్లాడుతూ సాధారణంగా ఇటువంటి అభివృద్ధి పనులు స్థానిక నిధులతో పూర్తి చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కోరిక మేరకు.. సమస్య తీవ్రతను గుర్తించి జడ్పీ నిధులతో ఈ పథకం పూర్తి చేయించినట్లు చెప్పారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా వారు గ్రామంలో పర్యటించారు.

పెట్రోల్‌కు బదులు నీళ్లు కొట్టారు

● బంకు ముందు వాహనదారుల ఆందోళన..

మాచవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మాచవరం పెట్రోల్ బంకులో పెట్రోల్‌కు బదులు నీరు కొట్టడంతో వాహనదారులు బంకు ముందు ఆందోళన చేపట్టారు. శుక్రవారం బంకులో పెట్రోల్ కొట్టించుకున్న వినియోగదారులు కొంతదూరం వెళ్లే సరికి వాహనాలు ఆగి పోవడంతో.. నెట్టుకుంటూ పెట్రోల్ బంకు వద్దకు వచ్చారు. అంతలోనే బంకు వద్ద మరి కొంత మంది వినియోగదారులు నీరు కొడుతున్నారంటూ బంకు యజమానులను నిలదీశారు. ఈ విషయమంతా దావనంలా వ్యాపించటంతో సుమారు వంద మంది వరకు వినియోగదారులు గుమిగూడి బంకు నిర్వాహకులను నిలదీశారు. వారి నుంచి సరైన సమాధానం రాలేదు. అదే బంకులో మరో ట్యాంకు ద్వారా పెట్రోల్ మంచిగానే వస్తుందని నిర్వాహకులు, వినియోగదారులు గమనించారు. ఐతే పెట్రోల్‌లో నీరు ఎలా కలిసిందనే విషయంపై నిర్వాహకులు చెప్పలేక పోవడంతో.. వినియోగదారులకు పరిహారం చెల్లించేందుకు ఒప్పుకున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ నాగమల్లేశ్వరరావును వివరణ కోరగా ఈ విషయం తమ దాకా రాలేదని, నిపుణులతో కలసి పెట్రోల్ బంకును తనిఖీ చేసి నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మాచవరం పెట్రోల్ బంకులో ఆందోళన చేస్తున్న వాహనదారులు

కుక్కలు వెంటపడటంతో.. బైక్‌పై నుంచి పడి మహిళ మృతి

బాపట్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : కుక్కలు వెంట పడడంతో.. బైక్‌పై నుంచి మహిళ కింద పడి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోతురాజు కొత్తపాలెం గ్రామానికి చెందిన వారి చెన్నమ్మ (49), భర్త బుల్లిరెడ్డితో కలిసి ఉదయం మార్కెట్‌కు వచ్చారు. తిరిగి వెళ్తుండగా.. జీబీసీ రోడ్డులో పోలేరమ్మ తల్లి దేవాలయం వద్ద కుక్కలు వెంటపడ్డాయి. భయంతో బైక్ స్పీడ్ పెంచడంతో చెన్నమ్మ కింద పడిపోయింది. తలకు తీవ్రగాయమై మృతి చెందింది. ఈ మేరకు పట్టణ ఎస్‌ఐ చంద్రావతి కేసు నమోదు చేశారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 13.59 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా 3,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు.. మొత్తం నాలుగు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

44,297 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 40,141 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 44,297 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 3,365 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9600	10800
334	9500	13000	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	13300	334	9500	12800
273	----	-----	నెంబరు. 5	10000	13500
341	10000	13600	273	---	---
4884	----	---	341	10000	13700
సూపర్ 10	10000	13000	4884	10000	12400
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14000	తేజ	10000	13800
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	12700
బ్యాడిగి	10000	12400	దేవనూరు డీలక్స్	10000	12600
దేవనూరు డీలక్స్	10000	12400	తాలుకాయలు	4500	7000

సంక్షిప్తం...

● పిడుగురాళ్ల: మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కొనసాగుతున్న సమ్మె 6వ రోజుకు చేరుకుంది. పారిశుధ్య కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సరైన స్పందన చూపడం లేదని, మరో రెండు మూడు రోజులలో పరిష్కార దిశలోకి రాకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని సీఐటీయూ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీను తెలిపారు. మున్సిపల్ కార్మికులు రమేష్, ప్రతాప్, మధుసూదనరావు, పవన్, నాగుల్‌మీరా, నాగేశ్వరరావు, మేరమ్మ, చినవీరమ్మ, మార్తమ్మ, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ చక్రవర్తి శుక్రవారం తన సిబ్బందితో కలసి తనిఖీ చేశారు. ఆయా పోలింగ్‌కేంద్రాల్లో ఓటర్లకు అనుకూలంగా సౌకర్యాలు ఉన్నాయా?, సమస్యలేమైనా ఉన్నాయా? అనే విషయాలను ఆయన పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూస్తామన్నారు. ఆర్ఐ బోసుబాబు, సిబ్బంది ఉన్నారు.

● పట్టణంలోని 19వ వార్డులో నూతనంగా ఎంపికైన టీడీ పీ వార్డు ప్రెసిడెంట్ చేవూరు జయరావు, వార్డు సెక్రటరీ బాల సుందరరావులు శుక్రవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని కన్నా అభినందించారు.

● దాచేపల్లి: బంగారు కుటుంబాలపై (పీ-4)గ్రామసభ నిర్వహించారు. శుక్రవారం దాచేపల్లి మండలం భట్రుపాలెంలో భట్రుపాలెం, కాట్రపాడులో పీ-4 పథకంతో 79 కుటుంబాలను ఎంపిక చేసినట్టు తహసీల్దార్ శ్రీనివాస్‌యాదవ్ వివరించారు. వీరందరూ బంగారు కుటుంబాలకు అర్హులా? కాదా? పరిశీలించటానికి గ్రామసభ నిర్వహించినట్టు వివరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ గుప్తా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి రూరల్: మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాటూరి ఆస్పత్రి సహకారంతో మండలంలోని రెంటపాళ్ళ జెడ్పీ హైస్కూల్‌లో ఈనెల 20వ తేదీ ఉదయం 9:30 గంటలకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఎన్ఆర్ఐ మాగులూరి భానుప్రకాష్ శుక్రవారం తెలిపారు. సత్తెనపల్లి, పెదకూరపాడు మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

● మిర్చి సాగుచేసే రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలని, షేడ్ నెట్లలోనే మిరప నారు పెంచుకోవాలని జిల్లా రైతు శిక్షణా కేంద్రం డీడీఏ ఎం శివకుమారి అన్నారు. మండలంలోని గుడిపూడిలో పంటల సాగుపై శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆహార భద్రత పథకం కింద వందశాతం సబ్సిడీపై మినుములు, కంది విత్తనాలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఏవో బీ సుబ్బారెడ్డి, జిల్లా రైతు శిక్షణాకేంద్రం ఏవో ఎం అరుణ, టీడీ పీ నాయకులు ఎల్.గజానన, రామారావు, కె.పుల్లారావు పాల్గొన్నారు.

● నకరికల్లు: పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్‌రెఫెల్ సిస్టమ్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్ కె.పుల్లారావు ఆదేశించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామాల వారీగా వీఆర్‌వోలను, సర్వేయర్లు చర్యలు తీసుకోవాలని కోరారు. వివిధ ప్రభుత్వశాఖల్లో వస్తున్న అర్జీలను అధికారులు పరిష్కరించాలని కోరారు.

● బెల్లంకొండ: మండలంలోని పాపాయపాలెంలో శుక్రవారం తహసీల్దార్ అరుణ కుమారి పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. గ్రామంలో 23, 24, 25 బూత్‌లు ఉన్నాయని, 23వ బూత్‌లో అధికంగా ఓట్లు ఉన్నందున రెండు పోలింగ్ రూమ్‌లు ఏర్పాటుచేసేందుకు ఎన్నికల కమిషనర్ ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. సర్పంచ్ బత్తుల వెంకటరావు, పాఠశాల చైర్మన్ ఓర్సు మల్లికార్జునరావు, బ్రహ్మారెడ్డి, బీ సుబ్రహ్మణ్యం, ధర్మారావు, వీఆర్‌వో షేక్ రఫీ, రాజేష్ పాల్గొన్నారు.

● మండలంలోని కందిపాడులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నల్లమేకల లక్ష్మీనారాయణ ఇంటింటికి వెళ్ళి కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నంది, వెంకటసుబ్బయ్య, సోమయ్య పాల్గొన్నారు.

● అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి బాలచాముండికా సమేత అమరేశ్వరాలయం ప్రధాన రాజగోపురం పై పెరుగుతున్న పిచ్చిమొక్కలను తొలగించాలని భక్తులు కో రుతున్నారు. ఈ మొక్కలు పెద్దవి అయితే సిమెంట్ పెచ్చులు ఊడిపోయే ప్రమాదం ఉందని భక్తులు తెలిపారు.

● 1200 ఓట్లు దాటిన పోలింగ్‌బూత్‌ల విభజనకు రాజకీయపార్టీల నాయకులతో తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. సమావేశంలో జూపూడి గ్రామంలోని బూత్ నెం.203లో 1204 ఓట్లు ఉండటంతో అదనంగా బూత్‌ను ఏర్పాటు చేయడానికి సమావేశంలో అంగీకరించారు. సమావేశంలో డీటీ రాజు, ఆర్ఐ శిరోమణి, టీడీపీ మండల అధ్యక్షుడు మంచినేని రాజా, జనసేన పార్టీ అధ్యక్షుడు వాకా అఖిల్, సీపీఎం కార్యదర్శి సూరిబాబు పాల్గొన్నారు.

● పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ 16వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు ఎం శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం స్థానికపార్టీ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన మహాసభలు జరుగుతాయని తెలిపారు.

● క్రోసూరు: రాష్ట్రంలోని ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకే కాక ప్రతి ఒక్క సీపీఎస్ ఉద్యోగికి కంట్రిబ్యూషన్‌లో ప్రభుత్వ వాటాను పెంచాలని ఎస్‌టీయూ సీపీఎస్ ఉపాధ్యాయుల సం ఘం జిల్లా కన్వీనర్ టీ శరత్‌కుమార్ డిమాండ్ చేశారు.

● రెంటచింతల: ప్రతి ఒక్కరికి సుపరిపాలన ఫలాలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని జూలకంటి గౌతమ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పాలువాయిగేట్ లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో కరపత్రాలను అందచేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, నంబూరి శేషగిరిరావు, అర్జున్, సాంబయ్య, బెల్లంకొండ శ్రీనివాసరావు, నరేంద్ర, శీలంనేని శివ, మండలపు హనిమిరెడ్డి, అల్లం బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● మండలంలోని వివిధ గ్రామాలకు రాకపోకలు సాగించడానికి అనువుగా వుండే గోలి గ్రామ సమీపంలోని వాగుపై లోలెవల్ చప్టా పనులు వారంలో పూర్తవుతాయని ఆర్అండ్‌బీ డీఈ రమణయ్య, ఏఈ యూనస్ ఎలు చెప్పారు. జరుగుతున్న పనులను శుక్రవారం పరిశీలించారు.

● కారంపూడి : ఔత్సాహికులైన రైతుల కోసం వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన 80 శాతం సబ్సిడీపై డ్రోన్లు అందజేస్తున్నామని, రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఏవో పోట్ల నరసింహారావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రైతులు ముందుగా రూ.2లక్షలు బ్యాంకులో జమ చేస్తే ప్రభుత్వం రూ.8లక్షలు సబ్సిడీ అందిస్తుందన్నారు.

● కూటమినేతలు 18వ వార్డులో బోరువేయించి మోటారు బిగించారు. గురజాల 18వ వార్డులో నీటి సమస్యపై ఎమ్మెల్యే యరపతినేని దృష్టికి స్థానికులు తెచ్చారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కూటమి నేతలు బోరు ఏర్పాటుచేశారు. నేలవల్లి బొల్లయ్య, అడపా శ్రీనివాసరావు, శరమాల హనుమంతురావు, చింతకాయల కళ్యాణ్, జక్కా దుర్గ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

18 గంటలు శ్రమించే వ్యక్తి చంద్రబాబు

రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న హోంమంత్రి అనిత, మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, జూలై 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం 18 గంటలు పనిచేసే గొప్ప వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. పెదకూరపాడు మండలంలోని కంభంపాడులో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానాలైన తల్లికి వందనం, మహిళలకు మూడు గ్యాస్ సిలిండర్లు, ఆగస్టులో మహిళలకు ఉచిత బస్సు, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, మహిళలకు ఉపాధే లక్ష్యంగా కూటమి ప్రభు త్వం కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ప్రవీణ్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ని రంతరం శ్రమిస్తున్నారని, తన వంతు సహకారం అన్నివేళలా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమానికి రూ.వంద కోట్లు హెచ్చించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు వెన్నా సాంబశివారెడ్డి, నియోజకవర్గ నాయకులు పఠాన్ నూర్జహాన్, మాదినేని సుబ్బయ్య, మండల టీడీపీ అధ్యక్షులు ఏ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రులకు ఘన స్వాగతం

హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ప్రవీణ్‌లకు కంభంపాడు గ్రామ టీడీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సభలో అతిదులను ఎమ్మెల్యే ప్రవీణ్, ఆయన సతీమణి లావణ్య దంపతులు దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ సహకారంతో దివ్యాంగులకు ట్రైసైకిళ్ళను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య, టీడీపీ నేతలు అర్తిమళ్ళ రమేష్, భాష్యం ఆంజనేయులు, గల్లా బాబూరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, పరస తాళ్ళూరు సహకార సంఘం అధ్యక్షుడు ఏటుకూరి రత్నకుమార్, సురేష్, మద్దిరాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. వివిధ మండలాల నుంచి సహకార సంఘాల అధ్యక్షులు, ఆయా మండలాల పార్టీల అధ్యక్షులు, బీజేపీ, జనసేన పార్టీ నేతలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజావేదిక

సత్తెనపల్లి జూలై 18(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి నియోజకవర్గంలో ప్రజల సమస్యలను ప్రజావేదిక ద్వారా పరిష్కరిస్తున్నట్లు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజావేదికలో సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించాలని ఆదేశించారు.

మండల అభివృద్ధికి కృషి చేయండి: ఎంపీపీ స్వర్ణమ్మ



మాట్లాడుతున్న ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మ బాయి

అచ్చంపేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలో పని చేస్తున్న ఉద్యోగులందరూ సమయపాలన పాటిస్తూ మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ స్వర్ణమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధికారులు వారి శాఖల నివేదికలను వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు కొప్పురావూరి కోటేశ్వరరావును సన్మానించారు. ఎంఈవో ఏకుల ప్రసాదరావు, ఏవో వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, మాణిక్యం, పద్మ, పోట్ల శ్రీనివాసరావు, జువ్వా శంకర్, మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపాలెం నాగమ్మ చెరువులో నూతన మోటార్ల ఏర్పాటు

బెల్లంకొండ, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపాలెం, బెల్లంకొండ గ్రామాల మధ్యగల నాగమ్మ చెరువులో రూ 2.50లక్షల నిధులతో నూతన విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేసినట్టు డీఈ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండల కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి విద్యుత్ మోటార్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగమ్మ చెరువులో ఎమ్మెల్యే ప్రవీణ్ ఆదేశాల మేరకు నూతన విద్యుత్ మోటార్లను అమర్చామన్నారు. ఈ చెరువు ద్వారా బెల్లంకొండ, రాజుపాలెం మండలాల్లో 13 గ్రామాలకు ప్రతి రోజు 13 లక్షల క్యూసెక్కుల నీటి సరఫరా జరుగుతుందన్నారు.కార్యక్రమంలో ఏఈ మల్లికార్జునరావు, కృష్ణమూర్తి, సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కరాలపాడు సొసైటీ చైర్‌పర్సన్‌గా యలమందారెడ్డి

పిడుగురాళ్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కరాలపాడు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా అనబోతుల యలమందారెడ్డి శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. చైర్‌పర్సన్‌గా యలమందారెడ్డి, సభ్యులుగా సంకుల సాంబశివరావు, వేల్పుల రాజారావులను సొసైటీ కార్యదర్శి పోట్ల అంకారావు ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను పిడుగురాళ్ల ఏఎంసీ చైర్మన్ తురకా వీరస్వామి, పీఏసీఎస్ అధ్యక్షుడు వడ్డవల్లి సర్వేశ్వరరావు, గండికోట వెంకటేశ్వర్లు, పిల్లి చెన్నారావు, బడిగుంచల వెంకటేశ్వర్లు, కొరముట్ల ఆంజనేయులు, పిడుగురాళ్ల మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాదర్తి రాజేశ్వరి, బీజేపీ నేత ఆత్మకూరి కాశీవిశ్వనాథం అభినందించారు.

మంచినీటిని సరఫరా చేసిన టీడీపీ నేత అల్లయ్య

కారంపూడి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొన్ని ప్రాంతల్లో మంచినీటి ఇబ్బంది ఉండడంతో టీడీపీ నేత తోట అల్లయ్య ఆధ్వర్యాన శుక్రవారం ట్యాంకరు ద్వారా మంచినీటిని సరఫరా చేశారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంగులూరి అంజయ్య వాటర్ ట్యాంకరును ప్రారంభించి నీటిని అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మన శేషగిరిరావు, తోట నరసింహారావు, మస్తాన్ జానీ, కటికల బాలకృష్ణ, తుపాకుల చిన రత్తయ్య, పలిశెట్టి కొండ, జక్కా నరసింహారావు, జక్కా వీరయ్య, పలిశెట్టి శ్రీను, పురంశెట్టి వెంకటేశ్వర్లు, బి పేరయ్య, రామ్మూర్తి, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి

● విద్యుత్ శాఖ ఎస్ఈ డాక్టర్ విజయకుమార్



అధికారులతో సమీక్షిస్తున్న ఎస్ఈ డాక్టర్ విజయకుమార్

మాచర్లటౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ డాక్టర్ విజయకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో డీఈ నూతలపాటి సింగరయ్య ఆధ్వర్యాన డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ఈ పాల్గొని మాట్లాడారు. బకాయి త్వరిగతిన వసూలు చేయాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అగ్రికల్చర్, రెవెన్యూ, ఆర్‌డీఎస్ఎస్, పీఎం సూర్యఘర్ తదితర వాటిపై చర్చించారు. ఈ సమావేశంలో సీనియర్ అకౌంట్ ఆఫీసర్ బి వెంకటేశ్వరరావు, ఏఈ సింగయ్య పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలపై దాడులు

గురజాలటౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తున్న, ఉపయోగిస్తున్న దుకాణాలపై శుక్రవారం నగర పంచాయతీ కమిషనర్ శివన్నారాయణ దాడులు జరిపారు. ప్రధాన రహదారుల్లో ఉన్న దుకాణాలను కమిషనర్ తన సిబ్బందితో తనిఖీచేసి ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు, వస్తువులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత గురజాల పట్టణంగా ఉండాలని పిలుపునిచ్చారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మాచర్లటౌన్: పట్టణంలోని 53, 55 పోలింగ్ బూత్‌లను శుక్రవారం పులిచింతల ప్రాజెక్ట్ డిప్యూటీ కలెక్టర్, మాచర్ల నియోజకవర్గ ఎన్నికల అధికారి గాయత్రిదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ బూత్‌ల్లో వసతులపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, తెలుగు యువత నియోజకవర్గ నేత కోమటి వీరు, బొమ్మరబోయిన పూర్ణచంద్రరావు, దొడ్డా చంద్రశేఖర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతి

పిడుగురాళ్ళ, జూలై 18(ఆంధ్రజ్యోతి): కొండమోడు సమీపంలోని ఓ లాడ్జిలో కారంపూడి మండలం చినగార్లపాడుకి చెందిన చింతలచెరువు వీరాంజనేయరెడ్డి(38) శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. వీరాంజనేయరెడ్డి మరో స్నేహితుడితో కలిసి లాడ్జిలో మద్యం తాగాడు. అనారోగ్యంతో వున్న వీరాంజనేయరెడ్డి నిద్రలోనే మృతి చెందినట్లు పోలీసులకు తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు

● టీడీపీ యువనేత గౌతమ్‌రెడ్డి

మాచర్ల రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతోందని టీడీపీ యువనేత జూలకంటి గౌతమ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని విజయపురిసౌత్‌లో నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, మాజీ జడ్పీటీసీ శేరెడ్డి గోపిరెడ్డి, తెలుగు యువత జిల్లా కార్యదర్శి రామిశెట్టి సైదారావు, జనసేన మండల అధ్యక్షుడు సాంబశివరావు, సుధాకర్‌రెడ్డి, గుండాల శ్రీను, బొల్లా వెంకటేశ్వర్లు, ఆడెపు కోటయ్య, బసివిరెడ్డి, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు మైలపల్లి అప్పలరాజు, జనసేన నేతలు రాహుల్, చంద్రశేఖర్, గంటా ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న గౌతమ్‌రెడ్డి

మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్‌గా రాజబోయిన



మల్లీశ్వరి మధు యాదవ్

మాచర్లటౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మాచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్ పర్సన్‌గా రాజబోయిన మల్లీశ్వరి మధుయాదవ్‌ను నియమిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడింది. అలాగే వైస్ చైర్‌పర్సన్‌గా గుండాల లక్ష్మి, డైరెక్టర్లుగా గోపవరపు చెన్నకేశవ, పోలూరి అప్పారావు, కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సంచుల నాగేశ్వరరావు, పంగా శ్రీనివాసరావు, కొమ్ము మరియమ్మ, పోట్లావత్ రోశమ్మ, చీదెళ్ల ఆంజనేయులు, చింతమళ్ల వెంకట్రావు, గుర్రాల లక్ష్మమ్మ, ఏలూరి ఉమామహేశ్వరరావు, పేరువాల సునీత, షేక్ సైదాబీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మల్లీశ్వరి మధుయాదవ్ మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

పట్టణ ఎస్ఐగా వెంకట్రావు



ఎస్ఐ వెంకట్రావు

మాచర్లటౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణ ఎస్ఐగా మెడబలిమి వెంకటరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన నెల్లూరు నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎస్ఐ సంధ్యారాణి మాచర్ల రూరల్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు.


పాకాలపాడు పీఏసీఎస్ చైర్మన్‌గా కొనికినేని

సత్తెనపల్లి రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాకాలపాడు పీఏసీఎస్ చైర్మన్‌గా టీడీపీ సీనియర్ నాయకుడు కొనికినేని సత్యనారాయణను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనకు ఈ పదవి ఇప్పించిన ఎమ్మెల్యే కన్నాకు కృతజ్ఞతలు తెలిపారు.

క్రోసూరు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా షేక్ జెరీనా

క్రోసూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): క్రోసూరు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా షేక్ జెరీనా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. జెరీనా ఈ యార్డుకు తొలి మహిళా చైర్మన్ కావటం విశేషం. అమరావతికి చెందిన జెరీనా భర్త షేక్ జానీ జెడ్పీటీసీ మెంబరుగా పని చేశారు. జెరీనా నియామకం పట్ల పలువురు టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

అచ్చంపేట తహసీల్దార్‌గా శ్రీనివాసరావు



శ్రీనివాసరావు

అచ్చంపేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): అచ్చంపేట తహసీల్దార్‌గా కుంభా శ్రీనివాసరావు శుక్రవారం బా ధ్యతలు స్వీకరించారు. ఆయన సీఆర్‌డీఏలో తహసీల్దార్‌గా పనిచేసి అచ్చంపేటకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ సరోజ రాజుపాలెంకు బదిలీ అయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుర్గి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): దుర్గి, ధర్మవరం, పోలేపల్లి, కోటగుట్ట, ఎన్ఎస్ తండా, ముటుకూరు సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ రామయ్య తెలిపారు.

● ముప్పాళ్ళ: మండలంలోని పలు గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ జి.సుచరిత శుక్రవారం తెలిపారు. మాదల, రామకృష్ణాపురం, ఇరుకుపాలెంలలో ఉదయం 9గంటల నుండి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం

మాచర్ల రూరల్: మండలంలోని ముత్యాలంపాడులో టీడీపీ నేతలు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో శాంతినాయుడు, బెల్లంకొండ కృష్ణ, గుండాల శ్రీనివాసరావు, చిన శ్రీను, సంచుల నాగేశ్వరరావు, రంగయ్య పాల్గొన్నారు.

సొసైటీ చైర్మన్‌గా రామకృష్ణ ప్రమాణ స్వీకారం

కారంపూడి, జూలై 18(ఆంధ్రజ్యోతి): కారంపూడి సొసైటీ చైర్మన్‌గా శుక్రవారం నాగవరపు రామకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొని రామకృష్ణను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామకృష్ణ తనకు ఈ అవకాశం ఇచ్చిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికి, ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.



రామకృష్ణను సన్మానిస్తున్న టీడీపీ నేతలు



వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

రైతు ప్రయోజనాల కోసమే కిసాన్ మేళా

● పదేళ్లలో తొలిసారిగా రైతు ముంగిట శాస్త్రవేత్తలు

● యరపతినేని కృషితో కిసాన్ మేళా సక్సెస్

పిడుగురాళ్ల, జూలై 18(ఆంధ్రజ్యోతి): నడికుడిలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కిసాన్‌మేళాతో పల్నాడు ప్రాంత రైతుల్లో అధునాతన సాగు పద్ధతులపై కొంతైనా అవగాహన పెరిగేందుకు ఉపయోగపడింది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన వ్యవసాయ అనుబంధ శాఖలు ఎమ్మెల్యే యరపతినేని చొరవతో నడికుడిలో ఏర్పాటుచేసిన కిసాన్ మేళాతో రైతు ముంగిటకు రావడంతో పల్నాడు రైతాంగానికి మేలు చేసినట్లయింది. వ్యవసాయానికి ఇచ్చే రాయితీ, యంత్రాలు పూర్తిగా ఐదేళ్లలో ఒక్క రైతుకు కూడా ఇవ్వకపోవడం, కనీసం తైవాన్ స్ప్రేయర్లు కూడా రైతులకు ఇచ్చే పరిస్థితి గత ఐదేళ్లలో లేకపోవడంతో రైతులు సొంతంగా కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పదేళ్లలో తొలిసారిగా ..

పల్నాడు ప్రాంతంలో పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించే కుటుంబాలు ఎన్నో వున్నాయి. ఇప్పటికీ పాతతరం పద్ధతులతోనే వ్యవసాయం చేస్తూ నష్టపోతుండటాన్ని గమనించిన ఎమ్మెల్యే తొలిసారిగా నడికుడి మార్కెట్ యార్డులో రాష్ట్రస్థాయి కిసాన్ మేళా ఏర్పాటుచేసి సీనియర్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు రైతులతో ముఖాముఖి చర్చించడం, అధునాతన సాగు పద్ధతులపై సూచనలు చేయడం పల్నాడు రైతాంగానికి మేలు చేసినట్లయింది. 2016లో గురజాల నియోజకవర్గంలో అధిక వర్షాలకు జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు సీఎం చంద్రబాబు దాచేపల్లి, గురజాల ప్రాంతాలలో పర్యటించారు.

వ్యవసాయ విధానంపై నిత్య విద్యార్థిలా : శాస్త్రవేత్త శివన్నారాయణ

రైతులు నిత్య విద్యార్థిలా అధునాతన వ్యవసాయంలో మెలకువలు నేర్చుకోవాలని ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ జి.శివన్నారాయణ తెలిపారు. నడికుడి కిసాన్ మేళాలో ఆయన మాట్లాడుతూ అరచేతిలోనే వ్యవసాయం ఎలా చెయ్యాలో తెలుసుకునే టెక్నాలజీ సెల్‌ఫోన్‌లో వుందని, దానివల్ల రైతు పంట సాగు విధానం తెలుసుకోవచ్చని ప్రిన్సిపల్ సైంటిస్టు ఎస్ దుర్గాప్రసాద్, రమేష్, రాజేష్ తదితరులు తెలిపారు.

తల్లికి వందనంతో చదువుకు సాయం

● ఎమ్మెల్యే యరపతినేనితో దివ్యాంగుడైన పాల్

కూటమి ప్రభుత్వం వచ్చాక తల్లికి వందనం నిధులు తన చదువుకు సాయపడుతున్నాయని 11వ వార్డుకు చెందిన ఓర్సు పాల్ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు వివరించాడు. సుపరిపాలన తొలిఅడుగులో భాగంగా గురువారం రాత్రి ఎమ్మెల్యే యరపతినేని 11, 12 వార్డులలో పర్యటించి ఇంటింటికి వెళ్లి ఏడాదిపాలనలో కూటమి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా దివ్యాంగుడైన పాల్‌ను ఎమ్మెల్యే పరామర్శించి చదువుకు సాయం అందిస్తానని, ఇంట్లో రూ.6వేల పింఛన్‌ను రూ.15 వేలకు పెంచేలా కృషి చేస్తానన్నారు.

కన్నాను కలిసిన టీడీపీ ఎస్సీ సెల్ నేతలు

సత్తెనపల్లి, జూలై 18(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి నియోజకవర్గ, పట్టణ, వివిధ మండలాల ఎస్సీ సెల్ అధ్యక్షులుగా, కమిటీ సభ్యులుగా ఎంపికైన నాయకులు శుక్రవారం సత్తెనపల్లిలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. కన్నాకు వారు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని కన్నా సూచించారు. కన్నాను కలిసినవారిలో నియోజకవర్గ టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు బలిజేపల్లి సురేష్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు బండారు నాగరాజు, అంకాళ్ళ ప్రభుదాసు, మురికిపూడి మరియబాబు, శనగపూల నరసింహారావు, చిలకా నాగేశ్వరరావు, చిలకా చంటి, బొజ్జా కాంతారావు, నల్లూరి రవి, వెంకటరావు తదితరులున్నారు.

● సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాలలో నల్లబర్లీ పొగాకు సాగు చేసే రైతులకు ఉపయోగకరంగా సత్తెనపల్లి మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాన్ని మంత్రి అచ్చెన్నాయుడు మంజూరు చేశారు. రెండుమూడు రోజులలో మార్కెట్ యార్డులో ఈ కేంద్రం ప్రారంభం అవుతుందని పొగాకు రైతులు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు.

కిసాన్ మేళాపై విమర్శలు దుర్మార్గం

● టీడీపీ నేతల ఆగ్రహం

దాచేపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఆధునిక యంత్ర పరికరాలు ఉపయోగించే విధానం, సాంకేతిక రంగాల్లో వచ్చిన విప్లవాత్మక మార్పులను తెలియజేయాలనే సంకల్పంతో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన కిసాన్ మేళా గురించి కాసు మహేష్‌రెడ్డి విమర్శించటం తెలివి తక్కువతనానికి, దుర్మార్గానికి నిదర్శనమని టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నాలుగేళ్లలో ఎన్నడూ లేనివిధంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు హాజరై రైతులకు వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులను కిసాన్ మేళాలో వివరించారన్నారు. కిసాన్ మేళాను చూసేందుకు ఆంధ్రాతో పాటు తెలంగాణా రైతులు కూడా వచ్చారన్నారు. రైతులు అధిక సంఖ్యలో రావటాన్ని జీర్ణించుకోలేక కాసు మహేష్‌రెడ్డి తప్పుడు ఆరోపణలు చేయడం ఆయన దుర్మార్గ చర్యలకు పరాకాష్ట అన్నారు. కార్యక్రమంలో తంగెళ్ళ శ్రీనివాసరావు, బద్రి, వేముల వినోద్‌రెడ్డి, అక్కినపల్లి బాలయ్య, తిరుమల కుమార్, నిమ్మయ్య, అచ్చారావు, మల్లి, నాగేశ్వరరావు, భాస్కరరావు, రాఘవ, కృష్ణ, అప్పారావు, అబ్దుల్లా, శ్రీను పాల్గొన్నారు.

భర్త ఇంటి ముందు ఆందోళన

● మాచర్ల-గుంటూరు రహదారిపై నిరసన

రాజుపాలెం, జూలై 18(ఆంధ్రజ్యోతి): భార్యను పట్టించుకోకుండా వేధిస్తున్నాడని భార్య తరపు బంధువులు భర్త ఇంటి ముందు ఆందోళన చేసేందుకు శుక్రవారం సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఇరువురి కుటుంబ సభ్యుల మధ్య ఘర్షణ జరిగింది. వివరాలలోకి వెళ్తే మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ కరీంకు తెనాలి మండలం నందివెలుగు గ్రామానికి చెందిన పఠాన్ బుడేఖాన్ కుమార్తె నగీనను ఇచ్చి 13 ఏళ్లక్రితం వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారులు. ఆరేళ్ల నుంచి అబ్దుల్ కరీంకు వేరొకరితో వివాహేతర సంబంధం ఏర్పడింది. అప్పటినుండి కరీం భార్య వేధిస్తున్నాడు. నగీన తల్లిదండ్రులు పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో నచ్చచెప్పేందుకు ప్రయత్నించారు. అయినా అబ్దుల్‌కరీం ప్రవర్తనలో మార్పు రాలేదు. దీంతో నగీన తల్లితండ్రి వచ్చి 6 నెలల క్రితం నందివెలుగు తీసుకువెళ్లారు. ఆ సమయంలో పిల్లలను పంపలేదు. ఈ విషయంపై తెనాలి పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా పెట్టారు. పిల్లలను తీసుకువెళదామని శుక్రవారం నగీన తరపు బంధువులు రెండు వాహనాలలో సుమారు 20మంది గణపవరంలోని కరీం ఇంటికి వచ్చారు. అక్కడ ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగ్గా భర్త కరీం కంటికి గాయమైంది. దీంతో అబ్దుల్‌కరీం కేసు పెట్టేందుకు రాజుపాలెం పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. నగీన తరపు బంధువులు కూడా స్టేషన్‌కు వచ్చారు. స్టేషన్లో భర్త అబ్దుల్‌కరీంతో గొడవపడ్డారు. ఈ సమయంలో ఎస్సై, నగీన తరపు వారిని తమదైన శైలిలో స్టేషన్ బయటకు పంపారు. దీంతో తమపై పోలీసులు లాఠీచార్జ్ చేశారని మాచర్ల-గుంటూరు రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. దీంతో సత్తెనపల్లి సీఐ నాగేశ్వరరావు వచ్చి ఇరుపక్షాలతో మాట్లాడారు. తెనాలిలో కేసు నమోదైనందున అక్కడకు వెళ్లాల్సిందిగా ఇరువర్గాలకు సూచించారు.

పారిశుధ్య పాఠం నేర్చేదెన్నడు?

- విస్తరిస్తున్న పిడుగురాళ్ల పట్టణం
- తగ్గట్లుగా కనిపించని పారిశుధ్య సిబ్బంది
- పారిశుధ్య లోపంతో అనారోగ్య సమస్యలు
- సమీపిస్తున్న వర్షాకాలం
- పూడుకుపోతున్న మురుగు కాల్వలు
- ఆక్రమణల నుంచి కలగని మోక్షం
- చిన్నపాటి వర్షాలకే రోడ్లన్నీ జలమయం


మురుగు కాల్వల్లో పేరుకుపోయిన వ్యర్థాలు


తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిలిచిన వర్షపు నీరు


కాల్వపై నాపరాళ్లు పరిచిన దృశ్యం

పిడుగురాళ్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సమీపిస్తున్నా.. మున్సిపల్ అధికారులు ముందస్తు పారిశుధ్య చర్యలకు పూనుకున్నట్లు కనిపించడం లేదు. పిడుగురాళ్ల పట్టణంలోని 33 వార్డుల్లో ప్రధాన రహదారిలోని సైడ్ డ్రెయిన్స్‌తో పాటు పలు వార్డుల్లో ఉన్న కాల్వలు చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి. ప్రధాన రహదారుల వెంట దుకాణదారులు సైడ్ డ్రెయిన్స్‌ను స్లాబులు, నాపరాళ్లతో మూసివేయడంతో.. పారిశుధ్య కార్మికులు పూడిక తీసేందుకు వీలు పడటం లేదు. అద్దంకి - నార్కెట్‌పల్లి రహదారికి ఒకవైపు ఉన్న ప్రధాన సైడ్ డ్రెయిన్ ఓవర్ బ్రిడ్జి వద్ద నుంచి బస్టాండ్ వరకు ఆక్రమణకు గురైంది దుకాణదారులు పూర్తిగా దీనిని కప్పేశారు. కారంపూడి రోడ్డు, మాయాబజార్, వాసవి నగర్, రైల్వే స్టేషన్ రోడ్డులో సైడ్ డ్రెయిన్స్ అన్నీ ఆక్రమణలకు గురయ్యాయి.

పారిశుధ్య కార్మికులకు ఇబ్బందే

మురుగు కాల్వల పూడిక తీతకు పిడుగురాళ్ల పురపాలక సంఘంలో కాంట్రాక్ట్ కార్మికులతో కలిపి మొత్తం 111 మంది ఉన్నారు. అందులో సగం మందికి పైగా సెలవులతోనే గడుపుతారు. తాత్కాలిక సిబ్బందిని ఏర్పాటు చేసుకున్నప్పటికీ పట్టణం విస్తరిస్తున్న విధంగా.. పారిశుధ్య కార్మికుల సంఖ్య అందుకు తగ్గట్లు లేకపోవడంతో ఎక్కడికక్కడ పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. కొన్ని వార్డుల్లో పారిశుధ్య సిబ్బంది రెండు రోజులకు ఒకసారి పారిశుధ్య పనులు నిర్వహించాల్సి వస్తోంది. మురుగు కాల్వలు ఆక్రమించిన దుకాణదారులకు మున్సిపల్ అధికారులు నోటీసులు ఇస్తున్నప్పటికీ.. వాటిని ఏమాత్రం లెక్క చేయడం లేదు. ఆక్రమణలు తొలగిస్తే వ్యతిరేకత వస్తుందేమోనన్న పాలకవర్గం ఆలోచన వారికి వరంలా మారింది.

గుణపాఠం నేర్చుకోవాలి

గతేడాది ఆగస్టులో పట్టణ సమీపంలోని లెనిన్ నగర్‌లో పారిశుధ్యం సమస్య, నీటి కలుషితం వల్ల ఎంతో మంది అనారోగ్యంపాలయ్యారు. మరికొంత మంది కొన్ని కారణాలతో మృతి చెందడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది. అప్పటికప్పుడు అధికారులు స్పందించినప్పటికీ కొంతమంది తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ముందస్తుగా మేల్కోకుంటే.. అలాంటి ఘటనలు పునరావృతమైనా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. పెరుగుతున్న జనాభా, పట్టణ విస్తీర్ణానికి తగ్గట్టుగా పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచుకోవాల్సిన అవసరం ఉన్నప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సరైన సూచనలు రాకపోవడంతో మున్సిపల్ అధికారులు ఉన్న కార్మికులతోనే కాలం గడుపుతూ వస్తున్నారు.

అరుదైన డెస్మాయిడ్ ట్యూమర్ తొలగింపు


కేసు వివరాలు వెల్లడిస్తున్న రమణ యశస్వి, జీవన్ స్రవంతి

- శ్రమించిన 11 మంది వైద్యుల బృందం
- మహిళకు కొత్త జీవితం ప్రసాదం

గుంటూరుమెడికల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పది లక్షల మందిలో ఇద్దరికో, ముగ్గురికో వచ్చే అరుదైన డెస్మాయిడ్ ట్యూమర్‌తో ఆమె బాధపడుతోంది. కణితిని వెంటనే శస్త్ర చికిత్సతో తొలగించకుంటే క్యాన్సర్ ట్యూమర్‌గా మారే ప్రమాదం ఉంటుంది. అత్యంత ప్రమాదకరమైన ఈ ట్యూమర్‌ను శస్త్రచికిత్స చేసి తొలగించేందుకు ప్రైవేటు వైద్యులు సాహసించ లేదు. చివరి ప్రయత్నంగా బాధితురాలు.. గుంటూరు ప్రభుత్వాస్పత్రికి రాగా, ఆమె పరిస్థితి తెలుసుకొని చలించిన 11 మంది వైద్యుల బృందం అత్యంత నైపుణ్యంతో శస్త్రచికిత్స చేసి కణితిని తొలగించింది. దీంతో ఆమెకు కొత్త జీవితం లభించింది. వివరాల్లోకి వెడితే.. గుంటూరుకు చెందిన జీవన్ స్రవంతి (28) రెండేళ్ల కిందట అంబ్లికల్ హెర్నియాకి ల్యాప్రోస్కోపిక్ సర్జరీ చేయించుకున్నారు. రెండు నెలల తర్వాత పొట్ట మీద కణితి ఏర్పడి క్రమేపి పెరిగి పెద్దది కావడంతో చికిత్స కోసం ఆమె పలు ఆసుపత్రులను సంప్రదించారు. ఇది డెస్మాయిడ్ ట్యూమర్‌గా తెలిసిన ప్రైవేటు వైద్యులు సర్జరీ చేసేందుకు సాహసించ లేదు. చివరకు ఆమె జీజీహెచ్‌లో జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ వై.కిరణ్ కుమార్‌ను సంప్రదించారు. వైద్య పరీక్షల అనంతరం ల్యాప్రోస్కోపిక్ ఆపరేషన్ ద్వారా మెష్ వేసి కణితిని తొలగించారు. ఈ శస్త్ర చికిత్సలో జనరల్ సర్జరీ వైద్య బృందం కిరణ్ కుమార్, అరుణ, గీతిక, అక్షయ్, సత్యదేవ్, రవి, పావని, వెంకట రమణ పాల్గొన్నారు. పోలయ్య, శాంసన్, సంతోష్ తదితర ఎనస్థటిస్ట్‌లు మత్తు వైద్యం అందించారు. ఆపరేషన్ తర్వాత కూడా డెస్మాయిడ్ ట్యూమర్ మరలా వచ్చే గుణం ఉంటుందని, అందువల్ల రోగి తరచూ చెకప్ చేయించుకోవాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. అతి క్లిష్టమైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించిన జనరల్ సర్జరీ వైద్య బృందాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణయ శస్వి అభినందించారు.

రక్తం అందిస్తేనే.. ప్రసవం


. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో పరీక్షలకు వచ్చిన గర్భిణులు

- ప్రతి ముగ్గురు గర్భిణుల్లో ఒకరికి రక్తహీనత
- పౌష్టికాహారం తీసుకోక బలహీనం
- సత్తెనపల్లి డివిజన్‌లో ఆందోళనకరంగా పరిస్థితి

2024 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు 7,128 మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తే.. 2,761 మంది రక్త హీనతతో బాధ పడుతున్నట్లు వైద్యులు గుర్తించారు.


పరీక్షిస్తున్న గైనకాలజిస్టు బి.అరుణ

సత్తెనపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఇంటికి దీపం ఇల్లాలు. ఆమె ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బాగుంటుంది. కానీ, సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, బెల్లంకొండ, క్రోసూరు, అచ్చంపేట, పెదకూరపాడు మండలాలకు చెందిన పలువురు మహిళల్లో అది కూడా గర్భిణుల్లో చాలా మంది రక్త హీనతతో బాధ పడుతుండటం ఆందోళన కలిగించే విషయం. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు ఆయా మండలాల నుంచి గర్భిణులు, మహిళలు, బాలింతలు, బాలికలు చికిత్స నిమిత్తం వస్తుంటారు. వైద్యశాలలో గర్భిణులకు చికిత్స అందించే సమయంలో చాలా మందికి రక్తం ఎక్కించాల్సి వస్తోంది. గర్భిణులకు అంగన్ వాడీ కేంద్రాల్లో బాల సంజీవని పేరుతో కిట్లను పంపిణీ చేస్తున్నారు. నెలలో 25 కోడి గుడ్లు, ఐదు లీటర్ల పాలు, మూడు కేజీల విటమిన్‌లతో కూడిన బియ్యం అందిస్తున్నారు. కానీ, ఆశించిన స్థాయిలో ప్రయోజనం కన్పించడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని చాలా మంది గర్భిణులు తీసుకోవడం లేదు. ఈ విషయంలో నిర్లక్ష్యం చూపుతున్నారని స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు, వైద్యులు చెబుతున్నారు.

ఎన్నెన్నో సమస్యలు

రక్త హీనత బారిన పడిన మహిళల్లో చురుకుదనం లోపిస్తుంది. మెదడు, వెన్నెముక సమస్యలు వస్తాయి. తల్లి బలంగా ఉంటేనే శిశువు సైతం ఆరోగ్యంగా ఉంటుంది. రక్త హీనత బారిన పడిన గర్భిణుల శిశువుల్లో ఎదుగుదల ఉండదు. ప్రసవం జరిగాక కొన్ని రోజులు ఆస్పత్రిలోనే ఉండాల్సి వస్తోంది. అందుకే గర్భిణులు మంచి పోషకాహారం తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

సమతుల ఆహారం తప్పనిసరి

మహిళలు సమతుల ఆహారం తీసుకోవాలి. గర్భిణులు ఆకు కూరలు, పప్పు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. రాగి జావలో బెల్లం కలుపుకొని తాగాలి. గర్భిణులు బాగా తింటేనే బిడ్డ ఎదుగుదల ఉంటుంది. తల్లిబిడ్డ ఆరోగ్యంగా ఉంటారు.

- డాక్టర్ బంకా అరుణ, గైనకాలజిస్టు

ఐరన్ మాత్రలు, ఇంజక్షన్‌లు అందిస్తున్నాం



వైద్యశాలకు వచ్చే గర్భిణుల్లో రక్త హీనతతో బాధ పడే వారిని గుర్తించి ఐరన్ మాత్రలు, ఐరన్ శుక్రోజ్ ఇంజక్షన్‌లు అందిస్తున్నాం. రక్త శాతం పెరిగేందుకు కృషి చేస్తున్నాం. డెలివరి సమయంలో రక్తం కూడా అందిస్తున్నాం.

- డాక్టర్ లక్ష్మణరావు, సూపరింటెండెంట్, సత్తెనపల్లి ఏరియా వైద్యశాల

నిఘా నేత్రాలతో నేరస్థుల ఆటకట్టు


వృద్ధురాలు రాజేశ్వరి మృతదేహం(ఫైల్)


ఓ అపార్ట్‌మెంటులోని సీసీ కెమెరా

తెనాలి మారీసు పేట జూలై18, (ఆంధ్రజ్యోతి): పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో పలు కీలక మైన కేసుల్లో నేరస్థులను గుర్తించేందుకు నిఘా నేత్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. సీసీ కెమెరాల వ్యవస్థ ప్రయోజనాలను గుర్తించిన పోలీసులు గృహాలు, వ్యాపార సముదాయాలకు అమర్చుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. దీంతో చాలా వరకు నేర నియంత్రణ జరిగనప్పటికి.. అక్కడక్కడ కేసులనూ ఫుటేజీల సాయంతో ఛేదిస్తున్నారు. తెనాలి పట్టణంలో ముత్తెశెట్టిపాలెం కబేళా వంతన సమీపంలో చిన్న టిఫిన్ కొట్టు నిర్వహించుకునే ఒంటరి వృద్ధురాలిని నగల కోసం ఇంటి పక్కనే ఉంటున్న యువకులు పక్కా ప్రణాళికతో హత్య చేశారు. గొంతు నులిమి ప్రాణం తీసి ఆమె ఇంట్లోనే మంచంపై పడుకోబెట్టి నగలు దొంగిలించారు. పోలీసులు కేసు విచారణలో.. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా యువకులు చేసిన ఘాతకం బట్టబయలైంది.

● అదే విధంగా మారీసుపేటలో నివసించే మరో వృద్ధురాలు ధరించిన బంగారంపై పరిసర ప్రాంతంలో ఉండేవారి కన్నుపడింది. ఒంటరిగా ఉన్న వృద్ధురాలి ప్రాణం తీసి సహజ మరణంగా చిత్రీకరించి నగలు అపహరించుకుపోయారు. దీనిపై కుటుంబ సభ్యులు సైతం సహజ మరణంగా తొలుత భావించిన, నగలు కనిపించక పోవడంతో.. పోలీసులను ఆశ్రయించారు. అలాగే పరిమి డొంక రోడ్డులో అప్పడాల కంపెనీ నిర్వాహకురాలు తన ఇంటిలో వియ్యపురాలితో కలసి నివాసముంటోంది. ఒకరికి ఒకరు తోడు నిలిచి జీవనం సాగిస్తున్నారు. ఇదే అదునుగా పట్టపగలే వారి ఇంటిలోకి ప్రవేశించి అద్దెకు షాపు విషయం మాట్లాడదామంటూ ఇంట్లోకి ప్రవేశించి వృద్ధురాళ్లను హత్య చేశారు. పై రెండు కేసుల్లో సీసీ కెమెరాలు నిందుతులను పట్టించగా మధ్య కేసులో కెమెరాలు లేకపోవడంతో అనుమానస్పద మృతిగానే మిగిలింది. ఒంటరిగా ఉండే వృద్ధుల కుటుంబ సభ్యులు సీసీ కెమెరా ఆవస్యకతను గుర్తించి ఏర్పాటు చేసుకుంటే అగంతకులు అనుమానస్పద వ్యక్తులు ఇంటి ముందుకు రాగానే గుర్తించి చోరీలకు పాల్పడక ముందే వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని పలువురు చెప్తున్నారు. పలు మిస్టరీ కేసులు కూడా నిందితులను గుర్తించడంలో సీసీ కెమెరాల సహకారం ఎంతో ఉంది.

ఏర్పాటు చేసుకోవాలి: సీఐ రమేష్ బాబు

పెరుగుతున్న నేరాలను అదుపు చేసేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతున్నాయని త్రీటౌన్ సీఐ ఎస్ రమేష్‌బాబు అన్నారు. ఒంటరి వృద్ధులు, మహిళలు నివసించే ఇళ్లకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పట్టణంలో జరిగిన పలు నేరాల్లో సీసీ కెమెరాల ద్వారా నేరగాళ్లను పట్టుకున్నామని చెప్పారు.

ఈ రోడ్డుకు మోక్షం లేదా?

- రోడ్డు అభివృద్ధికి వైసీపీ ప్రభుత్వంలో రూ.22 కోట్లు మంజూరు
- బిల్లులు రావన్న భయంతో కాంట్రాక్టర్ పరార్
- టెండర్ రద్దుతో అధ్వానంగా రోడ్డు
- నాలుగేళ్లుగా అవస్థల నడుమ ప్రయాణం



కాలువను తలపిస్తున్న తెనాలి - నేలపాడు రోడ్డు

తెనాలిరూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణం నుంచి కొల్లిపర మండలానికి నేలపాడు గ్రామీణ ప్రాంతం మీదుగా వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డుకు వేసిన మెటల్ విడిపోయి తారు, గులకరాళ్లు సైతం రోడ్డు చివరలకు చేరి గుంతలమయంగా మారింది. దాదాపుగా 7కిలోమీటర్ల రోడ్డు గత వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి చేసేందుకు టెండర్ ప్రక్రియను చేపట్టి.. కాంట్రాక్టర్‌కు రూ.22 కోట్లకు అప్పగించారు. నాలుగేళ్లు గడుస్తున్నా ఈ రోడ్డుకు మాత్రం మోక్షం కలగడం లేదు. గత ప్రభుత్వంలో రోడ్డు పనులు చేపట్టినప్పటికీ బిల్లులు రావన్న భయం కాంట్రాక్టర్‌ను వెంటాడటంతో పనులు నిలిచిపోయాయి. టెండర్ సమయం దాటుతున్నా పనులు చేపట్టకపోవడంతో మంజూరైన నిధులు వెన్నక్కి పోగా కాంట్రాక్ట్ సైతం రద్దయింది. దీంతో రోజులు గడుస్తున్న కొద్ది దాని రూపురేఖలు మారిపోయాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్డు కాస్త కాలువ మాదిరిగా నీళ్లు నిలిచి దర్శనమిస్తోంది. ఈ రోడ్డుపై వెళ్లాలంటే వాహనదారులు సాహసం చేయాల్సి ఇక ఇదే మార్గంలో.. జగనన్న కాలనీలు సిరిపురం లేఅవుట్‌లు కూడా ఉన్నాయి. దాదాపుగా ఐదు వేల కుటుంబాలు నివసించేందుకు స్థలాలను అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. అర్బన్ హెల్త్ సెంటర్‌ను సమీపంలోనే ఏర్పాటు చేసింది. రోడ్డు సరిగా లేకపోవడంతో.. సిరిపురం లే అవుట్‌లో స్థలాలు పొందిన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ముందుకు రావడంలేదు. తెనాలి ఐతానగర్ నుంచి నేలపాటు, సిరిపురం మీదుగా కొల్లిపర మండలానికి వెళ్లే వారు గతంలో తక్కువ దూరంతో ప్రయాణించవచ్చని ఈ మార్గాన్ని ఎంచుకునే వారు. పొలాలకు రైతులు సైతం ఈ మార్గంలోనే వెళ్లి రావాల్సి ఉంది. ప్రజలందరికి ఉపయోగపడే ఇటువంటి రోడ్డుపై అటు వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయగా కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టాల్సి ఉంది.

ఆనందం వెద జల్లుతున్నారు


జమ్ములపాలెం గ్రామంలోని పొలాలలో వెదపెడుతున్న దృశ్యం

బాపట్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బాపట్ల నియోజకవర్గ రైతులు ఆనందం 'వెద'జల్లుతున్నారు. సముద్ర తీర ప్రాంత గ్రామాలకు సాగు నీరు అందించే పీటీ చానల్‌కు 120 నుంచి 150 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. తిమ్మరాజు కాల్వ ద్వారా సాగునీరు సరఫరా కావటంతో ఆయకట్టు రైతులంతా ఉత్సాహంగా వెద పెడుతున్నారు. బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల్లో ఈ ఏడాది రైతులు వెద సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. వరి నారు పెంచి.. నాట్లు వేస్తే సాగు ఆలస్యమవుతుందని భావించి ముందస్తుగానే వెదపెడుతున్నారు. అప్పికట్ల, చుండూరు పల్లి పరిసర ప్రాంతాల్లో ఇప్పటికే వెద పెట్టిన పొలాలు పచ్చని పైరుతో కళకళలాడుతున్నాయి. సముద్ర తీర ప్రాంతంలోని ఇసుక భూముల్లో కూడా వెద పెట్టారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పటికీ.. సాగు నీటికి ఎలాంటి ఇబ్బందులుండవని ఇరిగేషన్ అధికారులు భరోసానివ్వడంతో రైతులు ఉత్సాహంగా సాగు ప్రారంభించారు. కొంతమంది వరినారు పెంచుతున్నారు.


పీటీ చానల్‌లో ప్రవహిస్తున్న సాగునీరు


వెద పద్ధతి వరి చేనులో నిలిచిన వర్షపు నీరు

వెద పైరుకు.. వర్షపు జల్లు ఊపిరి

కొల్లూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వెద సాగు వరికి వరుణుడు జీవం పోశాడు. గురువారం సాయంత్రం, శుక్రవారం ఉదయం పడిన వర్షానికి.. పంటలు జీవం పోసుకుని కళకళలాడుతున్నాయి. ఈ వర్షాలతో మరో వారం రోజులు వరి పంటకు, నారుమళ్లకు నీటి తడులు అందించాల్సిన అవసరం లేదని, మళ్లీ అడపా దడపా వర్షాలు కురిస్తే పంటకు సాగునీరు అంది కళకళలాడతాయని రైతులు చెబుతున్నారు. వర్షాభావ పరిస్థితులతో ఖరీఫ్ ప్రారంభం నుంచి రైతులు ఇబ్బందులు పడ్డారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని మాగాణి భూముల్లో ఎక్కువ శాతం వెద పద్ధతిలో వరి సాగు చేశారు. మరికొందరు నారుమళ్లు పోశారు. జూలై నెల ప్రారంభం నుంచి వర్షపు జాడలు లేకపోవడంతో రైతులు వరి పంటకు, నారుమళ్లకు సాగునీరు అందించేందుకు బోర్లపై ఆధారపడ్డారు. ఇటీవల కాల్వలకు సాగు నీరు విడుదల అయినప్పటికీ పొలాలకు అందకపోవడంతో.. ఆయిల్ ఇంజన్లతో పంటకు తడులు అందించారు. విపరీతమైన వడగాలులు వీయడంతో రైతుల కష్టం కొరగాకుండా పోయింది. దీంతో వెద్ద పద్ధతి వరి పంట, నారుమళ్లు సాగునీరు అందకపోవడంతో జీవం కోల్పోతున్నాయి. పైగా సాగు నీటి తడుల కోసం రైతులపై అదనపు వ్యయ భారం పడింది. ఈ క్రమంలో పడిన వర్షాలు రైతులకు కొంత ఊరటనిచ్చినట్లైంది.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ప్రజాదర్బారులో అర్జీల స్వీకరణ

నరసరావుపేట టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రజల నుంచి 200పైగా అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్నారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాలను చూపుతామన్నారు. వినతి పత్రాలను పరిశీలించి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెట్రోల్‌పోసి నిప్పంటించిన నిందితుడి అరెస్టు

నరసరావుపేట లీగల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి), ఇంటి వద్ద గోడకట్టుకునే విషయంలో తలెత్తిన వివాదం నేపథ్యంలో భార్యాభర్తలపై పెట్రోల్‌తో దాడిచేసి ఓ మహిళ మృతికి కారకుడైన కేసులో నిందితుడైన నూజెండ్ల మండలం అయినవోలు గ్రామానికి చెందిన యలమందను శుక్రవారం సాయంత్రం అరెస్టు చేసినట్టు నరసరావుపేట డీఎస్పీ కె నాగేశ్వరరావు తెలిపారు. డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటి వద్ద గోడ కట్టుకునే విషయంలో తలెత్తిన వివాదం నేపథ్యంలో నిందితుడు యలమంద వరుసకు సోదరుడైన బ్రహ్మయ్య అతని భార్య మంగమ్మ ఈ నెల 16వ తేదీ తెల్లవారుజామున ఇంటి ముందు నిద్రిస్తుండగా వారిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. చికిత్స పొందుతూ మంగమ్మ ఈ నెల 16వ తేదీన మృతిచెందింది. బ్రహ్మయ్య గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడైన యలమందను అరెస్టు చేశారు. నిందితుని కోర్టులో ప్రవేశ పెట్టనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో వినుకొండ రూరల్ సీఐ ప్రభాకర్ అయినవోలు ఎస్‌ఐలు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

● నరసరావుపేట రూరల్, జూలై 18, (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ శుక్రవారం పాఠశాల సందర్శనలో భాగంగా జొన్నలగడ్డ ఎంపీపీ ఎస్ పాఠశాల జడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె నాలుగవ తరగతి పిల్లలతో ముచ్చటించారు. వారి చదువు రాత సామర్థ్యాలు తెలుసుకున్నారు.

● శావల్యాపురం: పారిశుధ్యం మెరుగుదలపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టిని సారించాలని నర్సరావుపేట డీఎల్‌పీవో లక్ష్మణరావు అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఐవీఆర్‌ఎస్ కాల్స్‌లో తక్కువ శాతం నమోదవ్వడంతో శావల్యాపురంలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

● ఈపూరు: మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం మధ్యాహ్నం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

● నరసరావుపేట రూరల్: మండలంలోని నిస్స్ కళాశాలలో జేఎన్టీయూ కాకినాడ ఆధ్వర్యంలో వారం రోజుల జాతీయస్థాయి ఫ్యాకల్టీ డెవలప్ ప్రోగ్రాం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఫార్మసీ రంగంలోని వివిధ విభాగాల నుంచి ఉత్తమ ప్రతిభగల అధ్యాపకులను ఎంపీ చేసి శిక్షణ తరగతులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

● నరసరావుపేట టౌన్: ఈ నెల 21 నుంచి ఉచిత యోగా శిక్షణ ప్రారంభం అవుతుందని శ్రీవెంకటేశ్వర యోగ సేవా కేంద్రం నరసరావుపేటశాఖ నిర్వాహకులు కూనిశెట్టి వెంకటజనార్ధనరావు శుక్రవారం తెలిపారు. పట్టణంలోని పట్టాభిరామస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీవెంకటేశ్వర కల్యాణ మండపంలో జరుగుతుందన్నారు. అదనపు సమాచారం కోసం 9490846333, 9491665733 నంబర్లు సంప్రదించాలన్నారు.

● చిలకలూరిపేట: మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ఎన్నికైన షేక్ కరీముల్లాను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, పలువురు టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. కరీముల్లాను ప్రత్తిపాటి అభినందించారు. యార్డ్ చైర్మన్‌గా తనను నియమించినందుకు పుల్లారావుకు కరిముల్లా కృతజ్ఞతలు తెలిపారు.

● చిలకలూరిపేట: మండలంలోని లింగంగుంట్లలో గ్రామంలోని తాగునీటి చెరువు వద్ద ఆకు కోయడానికి వెళ్లి కూరకుల లక్ష్మీ కాంతం (70) అనే వృద్ధ మహిళ శుక్రవారం చెరువులో పడి మృతి చెందింది. స్థానికులు గమనించి మహిళ మృతదేహాన్ని బయటకు తీశారు.

● చిలకలూరిపేట: పట్టణంలో నూతన కోర్టు భవన సముదాయానికి 91సెంట్ల స్థలాన్ని కేటాయింపు చేయించటంపై ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును స్థానిక బార్ అసోసియేషన్ కార్యవర్గం న్యాయవాదులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

● నరసరావుపేట టౌన్: యువత స్వయంగా అవకాశాలను సృష్టించేలా అభ్యసించాలని విజ్ఞాన్ టెక్నాలజీ బిజినెస్ ఇన్క్యుబేటర్ సంస్థ మేనేజర్ అబ్దుల్ రియాజ్ అన్నారు. శుక్రవారం స్థానిక ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంటర్ ప్రెన్యూయర్ షిప్ అండ్ ఇన్నోవేషన్ అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది.

● నరసరావుపేట కల్చరల్: అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేయాలని వయోజన విద్య ఉప సంచాలకులు ఆంజనేయులు జిల్లా అధికారులను కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సందు అక్షర ఆంధ్ర కార్యక్రమంపై జిల్లా స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు.

● రొంపిచర్ల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని శుక్రవారం పంపిణీ చేశారు. హ్యూబ్ రూట్ ఫౌండేషన్, ఎస్‌బీఐ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఆహారాన్ని వారికి అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సాయిబాబు, సీహెచ్‌వో రమణమూర్తి, ఎంపీహెచ్‌ఎస్ రామయ్య, డీసీపీ రాజా రమేష్, టీబీ సూపర్‌వైజర్ ఎస్‌కే సుభానీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో వైసీపీ అనేది ముగిసిన అధ్యాయం

● జగన్ తిరిగి అధికారంలోకి రావడం కల్ల
● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు
● రూ.85.05లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

వినుకొండ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ అనేది ముగిసిన అధ్యాయమని, జగన్‌రెడ్డి తిరిగి అధికారంలోకి రావడం కల్లే అని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. చీఫ్‌విప్ కార్యాలయంలో శుక్రవారం సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. 48మంది లబ్ధిదారులకు రూ.85.05 లక్షల విలువైన చెక్కులు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక్కసారి అవకాశం ఇచ్చిన పాపానికి భరించలేని అరాచకాలతో చెలరేగిపోయిన వైసీపీ కథను ప్రజలు ఎప్పుడో ముగించారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తామంటూ భ్రమల్లో బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వంలో ఉన్నప్పుడు ప్రజలపై రాక్షసపాలన నడిపిన నాయకుడికి తిరిగి అవకాశం రావాలన్న ఆలోచనే ఆశ్చర్యంగా ఉందన్నారు. ఏడాదిలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో 50,250మందికి రూ.394కోట్లు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా లబ్ధిదారులకు అందజేయడం జరిగిందన్నారు. ప్రజల ప్రాణాలు కాపాడాలనే ఒకే ఒక సంకల్పంతో పనిచేస్తున్న ఈ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి సాయం అందిస్తోందని, ఇప్పటివరకు నియోజకవర్గంలో 604మందికి రూ.4.72కోట్లు పంపిణీ చేశామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 24గంటల్లోనే సాయం అందించగల్గుతున్నామన్నారు. జగన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తే ఈ రాష్ట్రం చీకట్లోకి వెళ్లిపోతుందని, ప్రజలు అర్థం చేసుకున్నారే కాబట్టే 94శాతం స్ట్రైక్ రేట్, 164 స్థానాలతో కూటమికి ప్రజలు పట్టం కట్టారన్నారు. ఆ పార్టీ నేతలు ఇకనైనా ప్రజాస్వామ్య విలువలకు గౌరవం చూపాలన్నారు. కార్యక్రమంలో పట్టణ, వివిధ మండలాలకు చెందిన టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

ప్రజా దర్బార్‌కు విశేష స్పందన

వినుకొండ టౌన్: పట్టణంలోని చీఫ్‌విప్ జీవీ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జీవీ ఆంజనేయులు పాల్గొని ప్రజల నుంచి 185 అర్జీలను స్వీకరించారు. వారి సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావుతో పాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు స్మృతివనంకు భూమి కేటాయింపు హర్షణీయం

● ఎమ్మెల్యే చదలవాడ, పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు

నరసరావుపేట టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అమరజీవి 58 అడుగుల విగ్రహం, స్మృతివనం ఏర్పాటుకు 6.8 ఎకరాలు స్థలం కేటాయించడంపై శుక్రవారం పలువురు హర్షం వ్యక్తం చేశారు. నరసరావుపేట పట్టణంలో ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు శివుని బొమ్మ వద్ద ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, వైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక ఆర్యవైశ్యలకు ఇచ్చిన మాట ప్రకారం కార్పొరేషన్ ఏర్పాటు చేశారని, పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవం, అమ్మవారి జయంతి కార్యక్రమాలను ప్రభుత్వ పరంగా నిర్వహించమే కాక అమరజీవి స్మృతివనానికి 6.8 ఎకరాలు స్థలం కేటాయించి ఆర్యవైశ్యులకు అన్నివిధాల సముచిత స్థానం కల్పించిందన్నారు. వ్యాపారులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తుందన్నారు. గత ప్రభుత్వం వ్యాపారులను హింసించి, అక్రమ కేసులతో ఇబ్బందులకు గురిచేసిందన్నారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అత్తులూరి సుబ్బారావు, కొల్లి బ్రహ్మయ్య, బులియన్ మర్చంట్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, ఆర్యవైశ్య సంఘం, కూటమి నాయకులు పాల్గొన్నారు.


పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, ఆర్యవైశ్య సంఘం నాయకులు


నల్లపాటి శివరామచంద్రశేఖరరావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, మంత్రి గొట్టిపాటి రవికుమార్, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తదితరులు

జీడీసీసీబీ మాజీ చైర్మన్ నల్లపాటికి ఘన నివాళి

నరసరావుపేట టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలో జీడీసీసీబీ మాజీ చైర్మన్ నల్లపాటి శివరామచంద్రశేఖరరావు సంస్మరణ సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు నల్లపాటి శివరామచంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన కుమారులు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాదు, వంశీమోహన్‌లను, కుటుంబ సభ్యులను పలువురు పరామర్శించారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, సీపీఐ నాయకుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు, కనపర్తి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, మాజీ జీడీసీసీబీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి షేక్ కరిముల్లా, సదాశివరావు, కొల్లి బ్రహ్మయ్య, రంగిశెట్టి రామకృష్ణ తదితరులు నివాళి అర్పించారు.


నల్లపాటి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు తదితరులు

విలీన గ్రామాల్లో సమస్యలపై కౌన్సిల్‌లో చర్చ

చిలకలూరిపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటిలో విలీనమైన గణపవరం, పసుమర్రు, మానుకొండవారిపాలెం గ్రామాల్లో అభివృద్ధి జరగటం లేదనే కారణంతోనే ఆయా గ్రామాల ప్రజలు గ్రామ పంచాయతీలుగా కొనసాగించాలని తీర్మానం చేశారని శుక్రవారం జరిగిన కౌన్సిల్ సమావేశానికి అధ్యక్షత వహించిన మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. విలీన గ్రామాల ప్రజల వ్యతిరేకత దృష్ట్యా మున్సిపాలిటీ నుంచి బయటకు వెళ్లటానికి అంగీకారం తెలిపే అంశంపై సమావేశంలో చర్చ జరిగింది. వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ మూడు గ్రామాల నుంచి ఏడుగురు వార్డు కౌన్సిలర్లు ఎన్నికయ్యారన్నారు. ఆయా గ్రామాల్లో నిధుల కొరత కారణంగా కనీస అవసరాలైన తాగునీరు, పారిశుధ్యం, వీధి లైట్ల నిర్వహణ దుర్భరంగా మారిందని, సిబ్బందికి జీతాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. టీడీపీ కౌన్సిలర్ల గ్రూపు నాయకుడు గంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల విలీనం వల్ల గ్రామాల అభివృద్ధి నిలిచిపోయిందని, అందువల్లే తిరిగి ఆయా గ్రామాల ప్రజలు విలీనాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం చేశారని వెల్లడించారు. చర్చ అనంతరం మున్సిపాలిటీలో విలీనమైన ఈ మూడు గ్రామాలను డీనోటిఫై చేస్తూ తీర్మానం చేశారు. చిలకలూరిపేట నరసరావుపేట రోడ్డులో గంగమ్మగుడి వద్ద కోర్టు నూతన భవనాల నిర్మాణం కోసం 91 సెంట్ల స్థలం కేటాయింపునకు అభ్యంతరం లేదని కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు. 10వ వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి ప్రస్తావించిన ఆక్రమణలు సమస్యపై మునిసిపల్ కమిషనర్ పి శ్రీహరిబాబు మాట్లాడుతూ అన్ని ప్రాంతాలలో ఆక్రమణలు తొలగిస్తామని స్పష్టం చేశారు. 22వ వార్డు కౌన్సిలర్ ప్రమీల మాట్లాడుతూ తమ వార్డులో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, వీటిని నియంత్రించాలని కోరారు. కమిషనర్ శ్రీహరిబాబు సమాధానమిస్తూ ఇప్పటికే సుమారు 370 కుక్కలకు స్టెరిలైజేషన్ (కుటుంబ నియంత్రణ) ఆపరేషన్లు పూర్తి చేశామని తెలిపారు. అన్ని కుక్కలకు స్టెరిలైజేషన్ చేసి, వాటిని పూర్తిగా నియంత్రించడానికి అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. మరో 500 కుక్కలకు స్టెరిలైజేషన్‌కు కౌన్సిల్ ఆమోదం లభించింది. చైర్మన్ అజెండాలోని 27అంశాలను అమోదిస్తున్నట్లు తెలిపి సమావేశం ముగించారు.


చిలకలూరిపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్మన్ షేక్ రఫాని, సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

రజిని చేసిన తప్పులకు మూల్యం చెల్లించక తప్పదు

● టీడీపీ నాయకుల ధ్వజం

చిలకలూరిపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి విడదల రజిని చేసిన తప్పులకు ఆమె తగిన మూల్యం చెల్లించక తప్పదని, ఆమె అవినీతి లెక్కలన్నీ బయటకు తీస్తామని టీడీపీ నాయకులు శుక్రవారం హెచ్చరించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రజిని ఎమ్మెల్యే ప్రత్తిపాటిపై చేసిన ఆరోపణలను ఖండించారు. రజిని అవినీతి బాగోతాలలో ఇప్పటివరకూ బయట పెట్టింది కేవలం ట్రెయిలర్ మాత్రమే అని, మొత్తం సినిమా ఇక ముందు చూస్తారని చెప్పారు. 2016లో మంజూరైన బైపాస్ రహదారిని తానే తెచ్చానని చెప్పుకుంటారని, బైపాస్ రోడ్డు మంజూరు అయ్యే సమయానికి రజిని దేశంలోనే లేరన్నారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి, రాష్ట్ర ప్రభుత్వం 25శాతం నిధులు భరించేలా నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ప్రత్తిపాటి పుల్లారావు ఒప్పించి రూ.850కోట్ల నిధులను బైపాస్ రోడ్డు కోసం మంజూరు చేయించారని తెలిపారు. రజిని అవినీతి దాహంతో బైపాస్ రోడ్డు కాంట్రాక్టర్‌ను కోట్లు డిమాండ్ చేసి, పనులు సంవత్సరం పాటు ఆగిపోయేలా చేశారని ఆరోపించారు. 2017లో 30పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేయించే ప్రతిపాదనలు పంపి 2018లో నిధుల కొరత ఉన్నప్పటికీ, నాబార్డు నిధులు రూ.19.50కోట్లతో ఏరియా ఆసుపత్రికి సంబంధించిన అన్ని అనుమతులు సాధించి 2019లో ప్రత్తిపాటి పుల్లారావు శంకుస్థాపన జరపారన్నారు. 100 పడకల ఆసుపత్రిని పుల్లారావు తీసుకువస్తే, మంత్రిగా ప్రహరీ నిర్మించలేని దుస్థితి రజినీదని ఎద్దేవా చేశారు. టిడ్కో గృహాలు పుల్లారావు తీసుకువస్తే, అందులో టైల్స్ కాజేసిన ఘనత మీదని, అమృత్ పథకం పుల్లారావు తీసుకువస్తే, దాని పేరు అడ్డం పెట్టుకుని గాంధీ పార్కు తాకట్టు పెట్టిన ఘనత మీదని విమర్శించారు. నియోజకవర్గ ప్రజలను నిలువునా ముంచేసి, కోట్ల రూపాయల అవినీతికి పాల్పడి, నియోజకవర్గాన్ని గాలికి వదిలేసి గుంటూరుకు పారిపోయి, అక్కడి ప్రజల తిరస్కరణకు గురై, మరోసారి మోసం చేయడానికి చిలకలూరిపేట వచ్చిన మాజీమంత్రి రజినీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు ఎస్.సదాశివరావు, కరిముల్లా, జె.మదనమోహన్, కె.రమణ, కొత్త కోటేశ్వరరావు, జరీనా సుల్తానా, జి.శ్రీనివాసరావు, సమద్‌ఖాన్, బేరింగ్ మౌలాలి, ఎం.మల్లిబాబు, అజహరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తుకు బాటలు వేస్తున్న చంద్రబాబు

చీఫ్ విప్ జీవీ

శావల్యాపురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ళ వైసీపీ పాలనలో అప్పుల ఊబిలో కూరుకుపోయి రాష్ట్రాన్ని ఏడాదిలోనే గాడినపెట్టి ఆంధ్రరాష్ట్ర భవిష్యత్తుకు సీఎం చంద్రబాబు బంగారు బాటలు వేస్తున్నారని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు శుక్రవారం మండల కేంద్రమైన శావల్యాపురంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. జీవీ మాట్లాడుతూ ఐదేళ్ళ అరాచక పాలనతో జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని 10.50లక్షల కోట్లు అప్పుల్లోకి కూరుకుపోయేలా చేస్తే చంద్రబాబు వాటిని తీర్చడమే కాక చెప్పిన మాటప్రకారం పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు ఢిల్లీవెళ్ళి రాష్ట్రానికి రూ.40వేలకోట్లు నిధులు తెచ్చి అమరావతి, పోలవరాలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. అన్నదాతసుఖీభవ పథకాన్ని పొందిన చిన్నారులు, తల్లిదండ్రులు ఎస్సీ కాలనీలో జీవీని కలసి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు గుంటూరు సాంబశివరావు, గ్రామపార్టీ అధ్యక్షుడు నలమాటి వెంకటేష్, సొసైటీ చైర్మన్ గడిపూడి విశ్వనాథం, డీసీ చైర్మన్ మండలపు వెంకటనారాయణ, సీనియర్ నేతలు గోరంట్ల హనుమంతరావు, యరమాసు కోటేశ్వరరావు, ఒత్తుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


శావల్యాపురంలో జీవీకి కృతజ్ఞతలు తెలుపుతున్న చిన్నారులు

బొల్లాపల్లి మండలంలో...

బొల్లాపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. గురువారం రాత్రి బొల్లాపల్లి మండలంలోని గార్లదిన్నె, రావులాపురం గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్ళి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెమ్మసాని నాగేశ్వరరావు, హనుమానాయక్, ఎలిశెట్టి రంగయ్య, దాసరి కోటేశ్వరరావు, ఆయా గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు.. వ్యక్తి మృతి


మృతిచెందిన రత్తయ్య (ఫైల్‌ఫొటో)

శావల్యాపురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని కారు వెనుక నుంచి ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం శావల్యాపురం మండలం పిచికలపాలెం గ్రామానికి చెందిన తిరువీధి రత్తయ్య (49) వ్యక్తిగత పనులపై రొంపిచర్ల మండలం కొనకంచివారిపాలెంలోని బంధువుల ఇంటికెళ్ళి ద్విచక్రవాహనంపై తిరిగి స్వగ్రామానికి వస్తుండగా కృష్ణాపురంలో జాతీయ రహదారి పక్కనున్న ప్రాథమిక పాఠశాల ముందు కారు వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనం నడుపుతున్న రత్తయ్య రోడ్డుపై పడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. కారు కృష్ణాపురంనకు చెందిన మరో బైకును ఢీకొట్టింది. ఆ వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. అదేసమయంలో వినుకొండ నుంచి నర్సరావుపేటకు వెళుతున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సంఘటన స్థలం వద్ద ఆగి ప్రమాదం జరిగిన తీరును స్థానికులను అడిగి తెలుసుకొన్నారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. ప్రమాదం ఘటనపై కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లోకేశ్వరరావు తెలిపారు.

పురుగు మందు తాగి వివాహిత ఆత్మహత్య


మృతిచెందిన కొల్లి పార్వతి

నాదెండ్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూబాడులో కొల్లి పార్వతి (25) అనే వివాహిత గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జంగాలపల్లి గ్రామానికి చెందిన పార్వతి, తూబాడు గ్రామానికి చెందిన పౌలురాజుతో ఐదు సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. ఇటీవల కుమారుడికి జ్వరం రావటంతో మందులు వాడుతున్నారు. కుమారుడికి జ్వరం తగ్గకపోవటంతో సకాలంలో మందులు వేయటంలేదంటూ పార్వతిపై భర్త పౌలురాజు ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో మనస్థాపానికి గురైన ఆమె గురువారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో గడ్డిమందు తాగింది. చికిత్స నిమిత్తం నరసరావుపేటకు ఆమెను తరించారు. కాగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఎస్‌ఐ పుల్లారావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఓపెన్ స్కూల్‌లో చదివేందుకు దరఖాస్తుల ఆహ్వానం

నాదెండ్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఓపెన్ స్కూల్‌లో 10, ఇంటర్ మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర, సమన్వయకర్తలు రవీంద్రనాథ్, హుస్సేన్‌లు కోరారు. మండల కేంద్రమైన నాదెండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 31వ తేదీతో గడువు ముగుస్తుందని, అర్హులైన వారు అడ్మిషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కే-రిడ్జి పాఠశాలలో వైద్య శిబిరం

నరసరావుపేట టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కే-రిడ్జి పాఠశాలలో ఫర్హానా హాస్పిటల్ ఆధ్వరంలో ఉచిత వైద్యశిబిరం శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ ఫరూక్ ఫర్వేజ్ షాక్‌వెబ్ పరికరంతో ఎముకల సాంద్రత పరీక్ష చేసి నొప్పులు ఉన్నవారికి మందులు పంపిణీ చేశారు. విద్యార్థినులకు డాక్టర్ ఫర్హానా పర్వీన్ టీనేజ్‌లో వచ్చే మార్పులపై అవగాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బర్నబాస్, పాఠశాల చైర్మన్ ఎన్.వెంకటేశ్వర్లు, కోమటినేని నాసరయ్య, క్యాంపస్ ఇన్‌చార్జి కోట బాహుజీ, విద్యార్థులు పాల్గొన్నారు.

అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు: తప్పిన ప్రమాదం

బొల్లాపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వినుకొండ నుంచి ప్రకాశం జిల్లా మర్రివేములకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి వెల్లటూరు సమీపంలో రోడ్డు పక్కకు వెళ్ళి ఆగిపోయింది. అదృష్టవశాత్తు బస్సులోని ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం సంభవించ లేదు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

నేడు శంకర స్వామి ఆలయ భూముల కౌలు వేలం

రొంపిచర్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రొంపిచర్లలోని శంకర స్వామి దేవాలయ ప్రాంగణంలో భూముల కౌలు వేలం శనివారం నిర్వహించనున్నట్టు కార్యనిర్వాహణ అధికారి పుణ్యాల వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మూడు సంవత్సరాల పాటు కౌలు చేసుకొనేందుకు ఈ వేలం జరుగుతుందన్నారు. దేవదాయ నిబంధనలకు లోబడి ఈ వేలం నిర్వహిస్తున్నామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

● రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

రొంపిచర్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. మండల కేంద్రమైన రొంపిచర్లలోని డీఆర్‌డీఏ కార్యాలయాల్లో ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు గృహ అవసరాలపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డ్వాక్రా మహిళల కోసం సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. యూనివర్శిటీ ఆధ్వర్యంలో మహిళలకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న డ్వాక్రా మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. యూనివర్శిటీ సీఎస్ఆర్ సీనియర్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎంవీ రమణ, ఏపీఎం సోమశేఖర్, కె.నరసింహారావు, బి.మస్తాన్‌రావు, డ్వాక్రా సిబ్బంది పాల్గొన్నారు.